# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 252 | హైదరాబాద్ | బుధవారం 01-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

అమెరికా సాయం చేయదు...
మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

# వారసత్వమే శాంతికి వారధి

- గాంధీనగర్‌లో సమ్రాట్ సంప్రతి మ్యూజియంను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే సమాధానమని వ్యాఖ్య
- వేల ఏళ్ల నాటి జైన కళాఖండాలు, పురాణాలకు నిలయంగా మ్యూజియం
- ఇది కేవలం మ్యూజియం కాదు, సాంస్కృతిక ఆరాధన కేంద్రమన్న ప్రధాని

11లో



## మూసీ పునరుజ్జీవం..
# సబ్ కమిటీ కీలక నిర్ణయాలు

- సమావేశమైన సబ్ కమిటీ సభ్యులు మల్లు భట్టివిక్రమార్క, పొన్నం ప్రభాకర్
- మూసీ పునరుజ్జీవంపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు తీసుకోవాలని నిర్ణయం
- ఏప్రిల్ 15వ తేదీ వరకు అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయం

11లో



## ఆక్రమణల చెర నుంచి ఊపిరి పోసుకున్న
# చెరువులు, పార్కులు!

- నగరం నలువైపులా హైడ్రా విరుచుకుపాటు..
- 8.24 ఎకరాల నాగిరెడ్డి కుంటకు విముక్తి
- రహదారులు, కాలువలపై అక్రమ కట్టడాల కూల్చివేత
- బడా రియల్టర్లు, కబ్జాదారుల గుండెల్లో రైళ్లు

12లో



## తెలంగాణలో
# ఐదు రోజుల పాటు వర్షాలు

ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని వెల్లడి




11లో

## కాంగ్రెస్ మార్క్
# అప్పుల పాలన..

- రోజువారీ ఖర్చుల కోసం ఆర్బీఐ దగ్గర చేయి చాచాల్సిన దుస్థితి
- కాగ్ నివేదికతో కాంగ్రెస్ ఆర్థిక విధ్వంసం బట్టబయలైంది

11లో



## స్పెయిన్ బాటలోనే..
# అమెరికాకు షాకిచ్చిన ఇటలీ

- తమ వైమానిక స్థావరాల్లో అమెరికా సైనిక విమానాలకు అనుమతి నిరాకరణ
- సిసిలీలోని గోనెల్లా వైమానిక స్థావరాన్ని ఉపయోగించుకోవడానికి ఇటలీ నో
- తమ బాంబర్ విమానాలు నిలపడానికి అమెరికా అనుమతి కోరినట్లు వార్తలు

11లో



## క్వాంటం అప్లికేషన్లతో
# ఆంధ్రప్రదేశ్ కే తొలి ప్రయోజనాలు

- 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం హార్డ్ వేర్ ఉత్పత్తి లక్ష్యం
- ఏప్రిల్ 14న అమరావతిలో దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్ ప్రారంభం
- 2030 నాటికి గ్లోబల్ క్వాంటం హబ్‌గా ఏపీని తీర్చిదిద్దేలా ప్రణాళిక
- క్వాంటం హార్డ్ వేర్ తయారీ ఎకోసిస్టంపై సీఎం చంద్రబాబు కీలక రౌండ్ టేబుల్ సమావేశం

11లో




## జిహెచ్ఎంసి పన్నుల వసూళ్ల సునామీ..
# విభజన ధమాకా

- మూడు ముక్కల పాలన: అభివృద్ధికి సరికొత్త చిరునామాలు
- జోన్ల వారీగా ఆదాయం: సైబరాబాద్ దూకుడు.. పాత నగరంలోనూ పట్టు!
- నేటి నుంచే 'ఎర్లీ బర్డ్' ధమాకా: 5% రాయితీ పొందే సువర్ణావకాశం
- ₹2,500 కోట్లతో రికార్డు వసూళ్లు.. పద్దులు పక్కా.. బకాయిలపై పంజా!

12లో



# సంపాదకీయం

## కంగారు పెట్టించిన కగార్

ఆపరేషన్ కగార్... మావోయిస్టులను కంగారు పెట్టేసింది. ఉడుకు రక్తంతో చావంటే తెలియని భయం... వయసు మీరిన తర్వాత వారి వెన్నులో వణుకు పుట్టించింది. మావోయిజంపై ఉక్కుపాదం మోపుతామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలతో భయపెట్టింది. ఆ హెచ్చరికలను మావోయిస్టులు లైట్ తీసుకోవడంతో యాక్షన్ ప్లాన్ అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వాన్ని భయపెట్టిన మావోలు.. ఇపుడు వాళ్లనే ప్రభుత్వం భయపడే స్థితికి తీసుకొచ్చింది. ఇంతకీ మన దేశంలో మావోల శకం ముగిసినట్టేనా.. వారికి నూకలు చెల్లినట్టేనా..కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆపరేషన్ కగార్ చేపట్టిన భద్రతా బలగాలు అడవులను జల్లెడపట్టింది. కనిపించిన మావోలను కనిపించనట్టుగా మట్టుబెట్టింది. ఆపరేషన్ కగార్... సత్ఫలితాలనిచ్చింది. మావోయిస్టు ఉద్యమంలో తలపండిన ఉద్ధండులు సైతం స్వచ్ఛందలొంగుబాటుకు దారితీసింది. దీంతో ఆ ఉద్యమం కనుమరుగైపోయింది. మావోయిస్టు ఉద్యమం రక్తాక్షరాలతో చరిత్రగా నిలిచిపోయింది. ఒకటే లక్ష్యం... భారత దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని కనుమరుగు చేయాలి. ఉద్యమంలో ఉన్నవారిని జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చి కొత్త జీవితాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. దీంతో తుపాకి వీడండి.. అడవుల్లో అజ్ఞాతం లోంచి జనజీవన స్రవంతిలో కలవండి అనే పిలుపుతో వెనుకాడిన మావోయిస్టులు.ఎన్ కౌంటర్ల తర్వాత స్వచ్ఛంద నిర్ణయంతో మనసు మార్చుకున్నారు. దీంతో మంచి నిర్ణయం తీసుకుని ప్రజాజీవితంలో గడిపేందుకు సమ్మతించారు.మావోయిస్టు ఉద్యమం ఒక చరిత్ర సృష్టించింది. ఇది నిజం. ప్రజా పాలనలో ప్రజా ఉద్యమంగా పురుడుపోసుకున్న మావోయస్టుల పోరాటం ముగిసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అడవుల్లో అన్నలు... పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రం వాళ్లను మోకాళ్లపై నిలబెట్టిందనే చెప్పాలి. ఈ క్రెడిట్ అంతా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకే దక్కుతుంది. భద్రతా బలగాలకు ఇచ్చిన స్వేచ్ఛతో పాటు పెరిగిన టెక్నాలజీని ఉపయోగించుకొని మావోయిస్టులను అష్ట దిగ్బంధనం చేశారు. మావోయిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, దామోదర్ , గంగన్న లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమం ముగిసిందనే చెప్పాలి. మావోయిస్టు పార్టీ చరిత్రలోనే ఇది అత్యంత కీలక లొంగుబాటుగా చెప్పవచ్చు.. మునుపెన్నడూ లేని రీతిలో ఒకేసారి నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిశారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ ఎలియాస్ కుమ్మదాదా , కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్ , తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ , రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్న డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున.. మిగిలిన ఇద్దరికీ రూ.20 లక్షల చొప్పున పునరావాసం చెక్కుల్ని అందించారు. రెండు నెలలుగా దేశవ్యాప్తంగా మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. మావోయిస్టులు ప్రభావం ఉన్న మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విప్లవాత్మ మార్పులు చోటుచేసుకున్నాయి. మావోయిస్టుల ఆగ్రనేతలు ఒక్కొక్కరుగా... తమ అనుచరగణంతో పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు.నక్సలైట్ల ఘాతుకానికి బలైన వారిలో అత్యధికులు పోలీసులు కాగా? పోలీసులకు సమాచారం అందించారని ఇన్ ఫార్మర్లపేరుతో అమాయకులను దారుణంగా కాల్చిచంపేశారు మావోలు. ఈ దారుణాలతో ప్రభుత్వాలనే కాదు.. అడవీ ప్రాంత ప్రజానీకాన్ని మావోలు భయపెట్టారు. గ్రామాల్లో ఉన్నవారు భయపడుతూ.. నక్సలైట్లకు ఆశ్రయిం కల్పించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్ని సౌకర్యాలను సమకూర్చాలి. సమీప బ్యాంకులను దోపిడీ చేయడం, పారిశ్రామిక వేత్తలను, పెద్ద పెద్ద భూ స్వాములను, కాంట్రాక్టర్లను, రాజకీయ నాయకులను బెదిరించి ఆర్థిక వనరులు సమకూర్చుకునేవారు. మాటవినకుండా.. చందాలు ఇవ్వని వారిని ప్రాణాలు తీసే విషయంలో వెనుకాడేవారు కాదు. మావోయిస్టుల మాట వింటేనే జీవితం.. వ్యతిరేకిస్తే మరణమే శాసనంగా అమలుచేశారు. వరుసగా జరిగిన పరిణామాలతో మావోయిస్ట్ అగ్ర నాయకురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క... పొలిట్ బ్యూరో సభ్యులు మల్లోజుల వేణుగోపాల్... కేంద్ర కమిటీ సభ్యులు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న... అగ్ర నాయకులంతా వరుసగా సుమారు 210 మంది మావోయిస్టులు పోలీసులకు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తెలంగాణకు చెందినవారే. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఈయన మావోయిస్ట్ ఉద్యమంలో ప్రవేశించి అంచెలంచెలుగా అగ్ర స్థానానికి చేరుకున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పిలుపుతో తుపాకీని పక్కనపెట్టి... అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ప్రజా సమస్యల పరిష్కారంకోసం... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గడగడలాడించిన మావోయిస్టు ఉద్యమం కనుమరుగైపోయింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆంక్షలు... అడవుల్లో గాలింపు చర్యలు... ఆపరేషన్ కగార్ అద్భుత ఫలితాలను ఇచ్చిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇకనుంచి అడవుల్లో తుపాకుల అలజడి వినపడదు. ఎదురు కాల్పులు జరగవు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు హెచ్చరికలుండవు.. అడవుల్లో ఎదురుకాల్పుల్లేని ప్రశాంత వాతావరణం నెలకొల్పాలనుకున్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందనే అభిప్రాయం పోలీసుల్లో వ్యక్తమవుతోంది.

## సంక్షోభం నుంచి బయిటపడదేలా...

నెల్లూరు మార్చి 31,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏపీలో రెండు సంక్షోభాలు తప్పేలా లేవు. ఒకటి అమరావతి. రెండోది అన్యమత అపవాదు. ఇటీవల అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. ఈ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన వైఖరి చెప్పలేదు. మరోవైపు ఆకివీడులో రఘురామకృష్ణం రాజు పై అన్యమతస్తుల పేరుతో దాడి ప్రయత్నం జరిగింది. శ్రీరామనవమి నాడు శ్రీరాముడి విగ్రహానికి పూలమాలలు వేస్తుండగా కొందరు అడ్డుకున్నారు. ఆ విషయంలో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన వైఖరి చెప్పలేదు. ఈ రెండు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంక్షోభాలుగా ఎదురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుఅమరావతి రాజధాని విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలే కాదు అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. అమరావతి విషయంలో ఎటువంటి వ్యతిరేక ప్రచారం జరిగినా దాని వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నది బహిరంగ రహస్యం.. ఆది నుంచి అమరావతి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైఖరి అలానే ఉంది. అమరావతి రాజధానికి ఏకాభిప్రాయం పేరుతో సమర్థించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసింది. అలాగని మూడు రాజధానుల ను నిర్మించలేకపోయింది. అయితే ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా అమరావతికి తాము వ్యతిరేకం కాదన్న మాట పరోక్షంగా చెప్పుకొచ్చింది. కానీ అదే విషయాన్ని సభకు వచ్చి చెప్పే అవకాశాన్ని కూడా చేజేతులా కోల్పోయింది.తాజాగా ఆకివీడు వ్యవహారం పొలిటికల్ సర్కిల్లో హాట్ రేపుతోంది. ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రఘురామకృష్ణం రాజు శ్రీరామనవమి నాడు శ్రీరాముడి విగ్రహానికి పూలమాలలు వేసేందుకు ప్రయత్నించగా కొంతమంది అడ్డుకున్నారు. దీనిపై ఇంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పందించలేదు. అదే ముస్లిం, క్రిస్టియన్ విషయంలో వేగంగా స్పందించే ఆ పార్టీ? హిందూ మతానికి సంబంధించిన విషయాలపై పెద్దగా స్పందించడం లేదనే విమర్శ మూటగట్టుకుంది.

# వైఎస్ ఫ్యామిలీలో కలహాల కాపురం



కడప, మార్చి 31,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం వైఎస్సార్ కుటుంబ అంతర్గత కలహాలు పెను దుమారం రేపుతున్నాయి. ఒకప్పుడు అభేద్యమైన కోటలా కనిపించిన ఈ కుటుంబంలో ఆస్తి పంపకాలు, వ్యక్తిగత విభేదాలు వీధిన పడటం చర్చనీయాంశంగా మారింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిల మధ్య సాగుతున్న ఈ పోరు కేవలం కుటుంబ వ్యవహారంగా మిగిలిపోకుండా రాజకీయ రంగు పులుముకోవడం వల్ల అనేక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాజకీయాల్లో అత్యున్నత పదవుల్లో ఉన్న నాయకులకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో కీలకం. జగన్ తన సోదరి షర్మిల లేవనెత్తుతున్న ఆస్తి వాటాల అంశాన్ని ప్రతిపక్షాల కుట్రగా భావించడం, చంద్రబాబు నాయుడు ట్రాప్‌లో ఆమె పడ్డారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆరోపించడం గమనార్హం. వ్యక్తిగత సమస్యలను రాజకీయ కోణంలో ఎదుర్కోవడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది.

తమిళనాడులో కరుణానిధి వారసుల మధ్య జరిగిన ఘర్షణలు, ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్ కుటుంబ సభ్యుల మధ్య తలెత్తిన విభేదాలు ఆయా పార్టీల ప్రతిష్టను భారీగా దెబ్బతీశాయి. ఇప్పుడు ఏపీలో కూడా జగన్ తన తల్లి విజయమ్మ, సోదరి షర్మిలపై పార్టీ నేతలతో విమర్శలు చేయించడం సొంత కేడర్‌ను సైతం విస్మయానికి గురిచేస్తోంది. రక్తసంబంధీకులపై ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల ప్రజల్లో జగన్ పట్ల ఒక రకమైన ప్రతికూల భావన ఏర్పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.అమ్మ, చెల్లి ఇద్దరూ ప్రత్యర్థుల చేతిలో పావులుగా మారారనే ప్రచారం సామాన్య ఓటర్లలో ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. తన సొంత కుటుంబ సభ్యులనే ఒప్పించలేని, మెప్పించలేని నాయకత్వం రాష్ట్ర ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తుందనే ప్రశ్నలు తలెత్తుతాయి. షర్మిల ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలిగా రాజకీయ విమర్శలు చేస్తున్నప్పుడు వాటిని రాజకీయంగానే తిప్పికొట్టాలి. అలా కాకుండా ఆస్తుల గొడవను తెరపైకి తెచ్చి ఆమెను వ్యక్తిగతంగా దూషించడం వల్ల వైఎస్సార్‌సీపీ ఇమేజ్ డ్యామేజ్ అవుతోంది తప్ప ప్రత్యర్థులకు ఆయుధాలు ఇచ్చినట్లు అవుతోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. కుటుంబ సమస్యలను నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోకపోవడం వల్ల రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఒకప్పుడు జగన్ వెనుక కొండంత అండగా నిలిచిన విజయమ్మ, షర్మిల నేడు ఆయనకు దూరంగా జరగడం అనేది భావోద్వేగపూరితమైన ఆంధ్ర ఓటర్ల మనోభావాలను దెబ్బతీస్తుంది. రాజకీయాల్లో ప్రత్యర్థులతో మైండ్ గేమ్స్ ఆడటం సహజం కానీ, అది కన్నతల్లి, కన్నచెల్లితో సాగితే ప్రజల నుంచి వచ్చే స్పందన మరోలా ఉంటుంది. ఈ వివాదం ఎంత కాలం సాగితే అంతగా వైఎస్సార్ వారసత్వంపై ప్రజలకున్న నమ్మకం సడలిపోయే ప్రమాదం పొంచి ఉంది. వ్యక్తిగత ఆస్తుల వివాదాలు రాజకీయాల్లోకి చొచ్చుకురావడం వల్ల ప్రతిపక్ష పార్టీగా ఎలా పని చేస్తున్నారు అనే దానికన్నా.. ఈ వివాదమే హైలెట్ అవుతుంది.

ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు గానీ, సంబంధిత రాజకీయ పార్టీకి గానీ అంత మంచిది కాదు. జగన్ ఈ అంశాన్ని కేవలం ఒక రాజకీయ నాయకుడిలా కాకుండా ఒక అన్నగా కుటుంబ పరిధిలోనే ముగించుకుంటేనే ఆయన వ్యక్తిగత ఇమేజ్‌కు మేలు జరుగుతుంది. లేకపోతే ఈ అంతర్గత కలహాలే భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీకి తీరని నష్టం చేకూర్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఏపీ కోచింగ్ సంస్థలపై కొరడా

విజయవాడ మార్చి 31,

ఏపీలో 'కస్టడీ' కోచింగ్ సెంటర్లను కట్టడి చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై కోచింగ్ పేరుతో విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలుంటాయి. 2026 పేరుతో కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. రాష్ట్రంలోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల 'ఇష్టారాజ్యానికి' అడ్డుకట్ట వేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రత, ఫీజుల పారదర్శకతను మెరుగుపరిచే లక్ష్యంతో ఉన్నత విద్యాశాఖ సరికొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు రిజిస్ట్రేషన్ రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది .కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగునంగా అనేక కొత్త నిబంధనలను జీవోలో పొందుపరిచారు.

ఏపీ కోచింగ్ ఇనిస్టిట్యూషన్ రూల్స్:

రోజుకు గరిష్టంగా 5 గంటలు మాత్రమే కోచింగ్ ఇవ్వాలి. పాఠశాల, కళాశాల పనివేళల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కోచింగ్ క్లాసులు నిర్వహించకూడదు.

ఆదివారాలు, ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం నిషేధం.

ఏదైనా కారణంతో విద్యార్థి కోర్సు మధ్యలో వదిలేస్తే.. మిగిలిన కాలానికి సంబంధించిన ఫీజును 10 రోజుల్లోపు తిరిగి చెల్లించాలి. 'ఫీజు వెనక్కి ఇవ్వబడదు' అనే నిబంధనలు ఇకపై చెల్లవు.

ఫీజుల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను తమ వద్ద ఉంచుకోవడం చట్టవిరుద్ధం.

విద్యార్థుల మార్కులు , ర్యాంకులను బహిరంగంగా హోర్డింగ్స్‌పై, వెబ్‌సైట్లలో గానీ ప్రదర్శించకూడదు. ఫలితాలను వ్యక్తిగతంగా తల్లిదండ్రులకు మాత్రమే తెలపాలి.

50 లేదా అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రతి సంస్థ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

గీత దాటితే వేటే:

నిబంధనలు రూపొందించడం మాత్రమే కాకుండా వాటి పర్యవేక్షకు కమిటీలు కూడా వేశారు. ఈ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 'జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీ' ఏర్పాటవుతుంది.దీనికి సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయి.మొదటిసారి ఉల్లంఘిస్తే 50,000 జరిమానా, రెండవసారి అదే తప్పు చేస్తే..1,00,000




జరిమానా విధిస్తారు. ఆ తర్వాత కూడా అలాగే జరిగితే కోచింగ్ సెంటర్ అనుమతి రద్దు అవుతుంది. పునరావృతమైతే కోచింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ రద్దు చే?సి శాశ్వతంగా మూత వేస్తారు. ప్రతి కోచింగ్ సెంటర్ తప్పనిసరిగా ఒక 'వెల్‌నెస్ సెల్' ఏర్పాటు చేయాలి. ఇందులో శిక్షణ పొందిన కౌన్సెలర్లు ఉండాలి. విద్యార్థులు చేరిన 30 రోజుల్లోపు వారి మానసిక స్థితిని అంచనా వేసి, అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. ఆత్మహత్యల నివారణకు హాస్టళ్లలో 'యాంటీ-సూసైడ్' స్ప్రింగ్ ఫ్యాన్ల ఏర్పాటును కూడా ప్రభుత్వం సూచించింది.ముఖ్యంగా రాష్ట్రంలో ర్యాంకుల రేస్, అనారోగ్యకరమైన పోటీని నివారించేందుకు ఈ రూల్స్ తెచ్చారు. (మెడికల్), (ఇంజనీరింగ్),బ్యాంకింగ్ ఉ క్లాట్ వంటి పోటీ పరీక్షలకు లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. ర్యాంకుల గోలలో కోచింగ్ సెంటర్లు విద్యార్థులపై పడుతున్న ఒత్తిడిని పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా కార్పోరేట్ కాలేజీలు ఇంటర్మీడియట్ విద్యార్థులను బందీలుగా మారుస్తున్నాయి. రోజుకు 18గంటల పాటు కోచింగ్ పేరుతో వాళ్లని వేధిస్తున్నాయి.

ఏమిటీ కేసు..?

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఓ సంఘటన కారణంగానే ఇప్పుడు ఈ రూల్స్ వచ్చాయి. విశాఖలో ఔఇఖ కోచింగ్ తీసుకుంటున్న 17 ఏళ్ల విద్యార్థిని అనుమానాస్పదంగా మరణించిన ఘటనతో ఈ కేసు ప్రారంభమైంది. కుటుంబం అఃఎ విచారణ కోరగా? సుప్రీంకోర్టు కేసును సీరియస్‌గా తీసుకుంది.. సుకేదమ్ సాహా, ఆంధ్రప్రదేశ్ అనే ఈ కేసుతో కోచింగ్ సెంటర్ల పనితీరుపై పెద్ద ఎత్తున ప్రశ్నలు తలెత్తాయి. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. అన్ని రాష్ట్రాలు వాటిని అమలు చేయాలని సూచించింది.

దీంతో కోచింగ్ సెంటర్లకు షాక్ ఇచ్చేలా కొన్ని గైడ్‌లైన్స్ జారీ చేసింది టాప్-బాటమ్ బ్యాచ్‌లుగా విభజించడం వద్దు పబ్లిక్‌గా విద్యార్థులను అవమానించడం నిషేధం

ఒత్తిడికి మించిన టార్గెట్స్ ఇవ్వకూడదు

ప్రతి ఇన్‌స్టిట్యూషన్‌లో కౌన్సిలింగ్ తప్పనిసరి

హాస్టళ్లలో హెల్ప్‌లైన్ నంబర్లు డిస్‌ప్లే చేయాలి

టీచర్లకు మెంటల్ హెల్త్ ట్రైనింగ్ కంపల్సరీ

రూఫ్‌టాప్, బాల్కనీలు వంటి హై రిస్క్ ఏరియాలకు యాక్సెస్ కంట్రోల్ వంటి ఆదేశాలిచ్చింది.

దానికి అనుగునంగా.. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం రూల్స్ విధించింది.

# చికెన్ లెగ్ పీస్ కోసం పెళ్లిలో ఘర్షణ పలువురికి గాయాలు

ఉత్తరప్రదేశ్లోని అమ్రోహా జిల్లా హసన్పూర్లో చోటు చేసుకున్న ఓ వింత సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్గా మారింది. సాధారణంగా పెళ్లిళ్లలో కట్న కానుకలు లేదా ఇతర మర్యాదల విషయంలో గొడవలు జరగడం చూస్తుంటాం.కానీ ఇక్కడ మాత్రం కేవలం చికెన్ లెగ్ పీస్ల కోసం ఏకంగా పెళ్లి పీటల వరకు వెళ్లాల్సిన వేడుక రణరంగంగా మారింది. ఘటన స్థానికంగానే కాకుండా ఇంటర్నెట్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది.హసన్పూర్కు చెందిన ఒక యువతికి, సమీప ప్రాంతానికి చెందిన యువకుడికి వివాహం నిశ్చయమైంది. పెళ్లి వేడుకలో భాగంగా వరుడి తరఫు బంధువులకు విందు ఏర్పాటు చేశారు.

భోజనాల సమయంలో వడ్డించిన బిర్యానీలో తమకు తగినన్ని చికెన్ లెగ్ పీస్లు రాలేదని వరుడి బంధువులు అసహనం వ్యక్తం చేశారు. వడ్డించే వారితో మొదలైన చిన్నపాటి వాగ్వాదం, చూస్తుండగానే ఇరువర్గాల మధ్య పెద్ద ఘర్షణకు దారితీసింది.కోపంతో ఊగిపోయిన ఇరు పక్షాల వారు భోజనశాలలోని కుర్చీలను ఒకరిపై ఒకరు విసురుకున్నారు. పళ్ళాలు, గ్లాసులు విసిరేయడంతో విందు ప్రాంగణం యుద్ధభూమిని తలపించింది. ఈ గందరగోళంలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి.

# యనమల రిటైర్మెంటేనా..

కాకినాడ మార్చి 31,

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో అత్యంత కీలకమైన నేతగా, మేధావిగా, వ్యూహకర్తగా వెలుగొందిన యనమల రామకృష్ణుడు రాజకీయ ప్రస్థానం ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నట్లు కనిపిస్తోంది. నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన ఆయన, తాజాగా కాకినాడలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీశాయి. “పదవుల కోసం నేను ఎవరినీ సాయం కోరలేదు.. భగవంతుడు అనుకున్నదే మన జీవితంలో జరుగుతుంది” అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, ఆయన రాజకీయ విశ్రాంతికి సంకేతాలా అనే అనుమానాలను బలపరుస్తున్నాయి. టీడీపీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు యనమల రామకృష్ణుడు పార్టీలో అగ్రస్థానంలో ఉంటూ వచ్చారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. చంద్రబాబుకు నమ్మినబంటుగా, పార్టీకి ఆర్థిక, రాజ్యాంగ పరమైన అంశాల్లో దిశానిర్దేశం చేస్తూ వచ్చారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఆయన పదవీ కాలం ముగిసే వరకు ఏదో ఒక పదవిలో ఉంటూనే ఉన్నారు. అయితే, ఎమ్మెల్సీ గడువు ముగిసిన తర్వాత పార్టీ అధిష్టానం ఆయనకు తదుపరి ఏ బాధ్యత అప్పగించలేదు. యనమల రామకృష్ణుడు రాజ్యసభకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ స్థాయిలో పార్టీ వాణిని వినిపించేందుకు తనకున్న అనుభవం ఉపయోగపడుతుందని ఆయన భావించారు. కానీ, ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా అధిష్టానం ఆ దిశగా ఆలోచించడం లేదని స్పష్టమవుతోంది. “రాజ్యసభ అడిగితే వచ్చేది కాదు.. మనం అనుకున్నది భగవంతుడు చేయడు” అని యనమల అనడం వెనుక, తనకు పదవి దక్కదని ఆయన ముందే గ్రహించారా అనే చర్చ మొదలైంది. “ఇంకా నాకు పదవి ఇవ్వండి.. నేను పరిగెడతాను అని అడగలేను” అని చెప్పడం ద్వారా ఆయన తన అసహనాన్ని లేదా వైరాగ్యాన్ని ప్రదర్శించినట్లు కనిపిస్తోంది. యనమల రాజకీయ గ్రాఫ్ తగ్గడానికి ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. కాకినాడ సెజ్ భూములపై ఆయన చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ఇది అధిష్టానానికి కొంత అసంతృప్తి కలిగించిందని సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో ఆయన అల్లుడు ఒక డ్రగ్స్ కేసులో పట్టుబడడం యనమల ప్రతిష్ఠను దెబ్బతీసింది. రాజకీయంగా క్లీన్ ఇమేజ్ ఉన్న ఆయనకు, ఈ ఘటన వ్యక్తిగతంగా, రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది. “పార్టీ మనుగడ కోసం శత్రువులకు కూడా సాయం చేశాను” అని యనమల అనడం ద్వారా పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూనే, తన సేవలకు తగిన గుర్తింపు లభించలేదనే ఆవేదనను వెలిబుచ్చినట్లు అనిపిస్తోంది. 44 ఏళ్లుగా పార్టీ తనను పోషించిందని చెప్పడం ద్వారా కృతజ్ఞత చాటుకున్నప్పటికీ, భవిష్యత్తులో తనకు ప్రత్యక్ష రాజకీయ పదవులు ఉండకపోవచ్చనే వాస్తవాన్ని ఆయన జీర్ణించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. టీడీపీ ఇప్పుడు యువ రక్తాన్ని ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తోంది. సీనియర్లకు గౌరవప్రదమైన స్థానం కల్పిస్తూనే, క్రియాశీలక పదవుల నుంచి వారిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే యనమలకు ఇక ‘రాజకీయ విశ్రాంతి’ తప్పదని ఆయన సన్నిహితులు సైతం గుసగుసలాడుకుంటున్నారు. మొత్తానికి, కాకినాడ వేదికగా యనమల చేసిన ఈ భావోద్వేగ వ్యాఖ్యలు ఒక సుదీర్ఘ రాజకీయ అధ్యాయం ముగింపునకు నాందిగా కనిపిస్తున్నాయి. అడగకుండానే పదవులను పొందిన యనమల, ఇప్పుడు అడిగినా దక్కని పరిస్థితిని ముందే పసిగట్టి గౌరవప్రదంగా తప్పుకోవడమే మేలని భావిస్తున్నారా? కాలమే సమాధానం చెప్పాలి.



# చట్టబద్ధత అడుగులు

విజయవాడ, మార్చి 31,

చట్టబద్ధత దిశగా అడుగులు పడుతున్నాయి. ఏపీ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమై అమరావతి ఏకైక రాజధానిగా గుర్తించాలని కేంద్రానికి ప్రతిపాదిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 2014 విభజన చట్టాన్ని సవరిస్తూ.. అమరావతిని కదిలించలేని స్థితిలో చట్టబద్ధత తేవాలన్న ప్రయత్నంలో చంద్రబాబు సర్కారు ఉంది. అందుకే తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. కేంద్ర ప్రభుత్వం సైతం వీలైనంత త్వరగా ఈ తీర్మానాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టి.. ఓకే చేయించే ప్రయత్నంలో ఉంది. అయితే ఇప్పుడు ఈ ప్రక్రియను ఢిల్లీ స్థాయిలో కీలక నేత ఒకరు పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయనే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం తో ప్రత్యుత్తరాలు జరుపుతూ.. వీలైనంత త్వరగా అమరావతికి చట్టబద్ధత కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్ ఆమోదం.. ఆ వెంటనే పార్లమెంట్లో ప్రవేశపెట్టి ఆమోదించేలా కార్యచరణ సిద్ధం చేస్తున్నారు. అయితే ఇప్పుడు వెంకయ్య నాయుడు సేవలను దీనికోసం ఉపయోగిస్తుండటం మాత్రం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ రాష్ట్ర రాజధాని కి లేని చట్టబద్ధత అమరావతికి అత్యంత ఆవశ్యం అని కేంద్రానికి చెప్పడంలో వెంకయ్య నాయుడు కీలకపాత్ర పోషించినట్లు సమాచారం. బిజెపిలో కీలక పాత్ర పోషించారు వెంకయ్య నాయుడు కానీ రెండోసారి బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తరువాత అనూహ్య నిర్ణయాలు వచ్చాయి. అందులో భాగంగా వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. దీంతో రాజ్యాంగబద్ధ పదవిలోకి వెళ్లిపోయారు వెంకయ్య నాయుడు. అప్పటినుంచి రాజకీయాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. కానీ ఒకానొక దశలో ఆయన పేరు రాష్ట్రపతి పదవికి వినిపించింది. ఉపరాష్ట్రపతులు రాష్ట్రపతి పదవులను అలంకరించడం చాలా సందర్భాల్లో చూసాం. అదే మాదిరిగా వెంకయ్య నాయుడుకు అవకాశం వస్తుందని అంతా భావించారు.

కానీ కేంద్ర పెద్దలు మాత్రం అనూహ్యంగా ద్రౌపది ముర్ముకు ఆ అవకాశం ఇచ్చారు. గిరిజన మహిళ కావడంతో జాతీయస్థాయిలో కలిసివచ్చే అంశంగా పరిగణించి అప్పట్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉపరాష్ట్రపతి పదవిని అలంకరించిన వెంకయ్యనాయుడు కార్యక్రమంలో రాజకీయాలు చేయలేకపోయారు. తెర వెనుక రాజకీయాల కు మాత్రమే పరిమితం అయ్యారు. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత కూడా వైయస్సార్ కాంగ్రెస్ చాలా రకాలుగా ఇబ్బందులు పెడుతోంది. అమరావతికి వ్యతిరేక ప్రచారం అధికమైంది. ఈ నేపథ్యంలో చట్టబద్ధత అనే అంశం తెరపైకి వచ్చింది. కానీ సాంకేతికంగా ఈ రాష్ట్ర రాజధానికి కూడా చట్టబద్ధత కల్పించలేని విషయాన్ని కేంద్రం స్పష్టం చేసింది. ఈ తరుణంలో చంద్రబాబు నాయుడు సీనియారిటీ కలిగిన వెంకయ్య నాయుడుకు ఈ పని అప్పగించారు.

ఏపీలో నెలకొన్న పరిస్థితులు, గత అనుభవాలను వెంకయ్య నాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు వివరించారు. ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత అత్యంత ఆవశ్యం అని.. అందుకు మార్గాలను సైతం సూచించారు వెంకయ్య నాయుడు. దీంతో కేంద్ర ప్రభుత్వం సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏప్రిల్ 1న కేంద్ర క్యాబినెట్లో చర్చించి ఆ మరుసటి రోజు పార్లమెంటులో బిల్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మొత్తానికైతే అమరావతి రాజధాని విషయంలో ఆది నుంచి అనుకూలంగా ఉంటూ వచ్చారు వెంకయ్య నాయుడు. ఇప్పుడు ఆయనే స్వయంగా అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో పాలుపంచుకుంటున్నారు. ఇది నిజంగా శుభ పరిణామం.

# ఇవాళ్టి నుంచి దేశవ్యాప్తంగా జనగణన... 33 ప్రశ్నలు అడగనున్న అధికారులు

హైదరాబాద్, మార్చి 31, )

జనాభా గణన దిశగా కీలక అడుగు పడింది. ఏప్రిల్ 1న ప్రారంభం కానున్న గృహాల జాబితా ప్రక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం 33 ప్రశ్నలతో కూడిన ఒక కొత్త ప్రశ్నావళిని విడుదల చేసింది. ఇంటర్నెట్ సదుపాయం, ఎల్‌పిజి, నీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాలతో పాటు మారుతున్న సామాజిక స్వరూపాన్ని అర్థం చేసుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది.

ఇంటర్నెట్ సౌకర్యాల లభ్యత..

2011లో నిర్వహించిన గత జనాభా గణన తర్వాత భారత సమాజంలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రశ్నావళిని రూపొందించడం జరిగింది. గృహాల రకం, ప్రదేశం, నిర్మాణం గురించిన ప్రశ్నలతో పాటు ఇంటర్నెట్ సౌకర్యాల లభ్యతకు సంబంధించిన ఒక కొత్త ప్రశ్నను కూడా చేర్చడం జరిగింది. అంతేకాకుండా ఎల్‌పిజి, తాగునీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాల లభ్యతకు సంబంధించిన సమాచారం కూడా సేకరిస్తారు.

ఆహార భద్రత, ప్రాంతీయ ఆహారపు అలవాట్లు..

ఈ ప్రశ్నావళి పారిశుధ్యం, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. ఇందులో మరుగుదొడ్ల లభ్యత, మురుగునీటి పారుదల వ్యవస్థలు, స్నానపు సౌకర్యాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. అదనంగా, కుటుంబాలలో వినియోగించే ప్రధాన ధాన్యాల గురించి కూడా సమాచారం సేకరించబడుతుంది. ఇది ఆహార భద్రత గతిశీలతను, ప్రాంతీయ ఆహారపు అలవాట్లను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

ఫిబ్రవరి 1, 2027న రెండో దశ ప్రారంభం..

2027 జనాభా లెక్కలు రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో ఇళ్ల జాబితా ప్రక్రియ ఉంటుంది. రెండో దశలో అసలైన జనాభా గణన ఫిబ్రవరి 1, 2027న ప్రారంభమవుతుంది. ఇది భారతదేశానికి మొత్తం మీద 16వ జనాభా లెక్కలు. స్వాతంత్ర్యం తర్వాత ఇది ఎనిమిదవది. ఇది దేశవ్యాప్తంగా విధాన రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికకు అవసరమైన కీలకమైన సమాచారాన్ని అందిస్తుంది.

2027 జనాభా లెక్కలలో అడిగే 33 ప్రశ్నలు ఇవే..

భవన సంఖ్య (పురపాలక లేదా స్థానిక అధికార సంస్థ లేదా జనాభా లెక్కల సంఖ్య)
ఇంటి సంఖ్య
ఇంటి నేల కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థం
ఇంటి గోడల కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థం
ఇంటి పైకప్పు కోసం ప్రధానంగా ఉపయోగించిన పదార్థం
ఇంటి ఉపయోగం
ఇంటి పరిస్థితి
కుటుంబ సంఖ్య
కుటుంబ సభ్యుల సంఖ్య
కుటుంబ పెద్ద పేరు
కుటుంబ పెద్ద లింగం
షెడ్యూల్డ్ కులం / షెడ్యూల్డ్ తెగ / ఇతర
ఇంటి యాజమాన్య స్థితి
ఇంటిలోని గదుల సంఖ్య
కుటుంబంలోని వివాహిత జంటల సంఖ్య
తాగునీటి ప్రధాన వనరు
తాగునీటి వనరు లభ్యత
ప్రధాన లైటింగ్ వనరు
టాయిలెట్ సౌకర్యం లభ్యత
టాయిలెట్ రకం
మురుగునీటి పారుదల సౌకర్యం
స్నానపు సౌకర్యం లభ్యత
వంటగది, ఎల్‌పిజి / పిఎన్‌జి కనెక్షన్
వంటకు ఉపయోగించే ప్రధాన ఇంధనం
రేడియో / ట్రాన్సిస్టర్
టెలివిజన్
ఇంటర్నెట్ సౌకర్యం
ల్యాప్‌టాప్ / కంప్యూటర్
టెలిఫోన్ / మొబైల్ ఫోన్ / స్మార్ట్‌ఫోన్
సైకిల్ / స్కూటర్ / మోటార్‌సైకిల్ / మోపెడ్
కారు / జీప్ / వ్యాన్
ప్రధానంగా తినే ధాన్యం

# తమిళనాడులో మనీ కూపన్ల మాయాజాలం

చెన్నై, మార్చి 31,

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కురుక్షేత్రంలో ‘మేనిఫెస్టో’ల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ విడుదల చేసిన డీఎంకే మేనిఫెస్టో, ప్రత్యర్థుల ఎత్తుగడలకు ఏమాత్రం తలొగ్గకుండా తన ద్రవిడ మోడల్ నమ్మకాన్నే ప్రతిఫలించింది. అన్నాడీఎంకే ఉచితాల వర్షం కురిపించినా, విజయ్ తన టీవీకే ద్వారా కొత్త ఆశలు రేపినా.. స్టాలిన్ మాత్రం తనదైన శైలిలో, అదనపు ఆకర్షణల కంటే ఆచరణాత్మక పాలనకే మొగ్గు చూపారుడీఎంకే మేనిఫెస్టోను సూపర్ స్టార్ గా అభివర్ణించిన స్టాలిన్, ప్రత్యర్థుల ఉచితాలకు దీటుగా తనదైన శైలిలో ఇల్లత్తరసి అనే పథకాన్ని ప్రకటించారు ఆదాయ పన్ను పరిధిలోకి రాని గృహిణులకు ఏకంగా రూ.8,000 విలువైన కూపన్ అందజేస్తామని, దీనితో వారికి నచ్చిన వాషింగ్ మెషీన్, టీవీ లేదా ఫ్రిజ్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చని వెల్లడించారు. అలాగే కలైంజ్ఞర్ మహిళా హక్కు పథకం కింద ఇస్తున్న నగదును ?1,000 నుండి 2,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రత్యర్థి పార్టీలు తన పాత పథకాలనే ప్రాతిపదికగా తీసుకుని పోటీ పడుతుండటంతో, తాను పెద్దగా పంథా మార్చుకోవాల్సిన అవసరం లేదని స్టాలిన్ బలంగా నమ్ముతున్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తన మేనిఫెస్టోలో ఉచిత రిఫ్రిజిరేటర్లు, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం వంటి భారీ హామీలు గుప్పించారు. అయితే, స్టాలిన్ దీనికి భిన్నంగా ఎంపిక చేసుకునే అవకాశాన్ని లబ్ధిదారులకే వదిలేశారు. ప్రభుత్వం నేరుగా వస్తువులు ఇచ్చే కంటే, ప్రజలే తమకు నచ్చిన వస్తువును కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించడం ద్వారా అవినీతికి తావులేకుండా చేయవచ్చని స్టాలిన్ భావిస్తున్నారు. అన్నాడీఎంకే ఉచితాల హోరును చూసి ఆయన ఏమాత్రం ఆందోళన చెందకుండా, తన పాత పథకాలనే స్కేల్-అప్ చేయడం ఆయన ధీమాకు నిదర్శనం. సినీ నటుడు విజయ్ తన తమిళగ వెట్రి కళగం మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి , డ్రగ్-ఫ్రీ స్టేట్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. కొత్త ఓటర్లు, యువతను ఆకట్టుకోవడమే లక్ష్యంగా విజయ్ అడుగులు వేస్తుంటే, స్టాలిన్ మాత్రం నాన్ ముదల్వన్ పథకం ద్వారా ఇప్పటికే 5 లక్షల మంది యువతకు శిక్షణ, నెలకు 1,500 స్టైపెండ్ ఇస్తున్నామని గుర్తు చేస్తున్నారు. కొత్త పార్టీల రాకతో ఓట్లు చీలిపోయినా, తన డెలివరీ సిస్టమ్ ( బలంగా ఉండటంతో విజయం తనదేనని స్టాలిన్ ఫిక్స్ అయ్యారు. తమిళనాడు చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని, ప్రజల మద్దతుతో ఏడవసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని స్టాలిన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థులు తనను అనుకరిస్తున్నారే తప్ప కొత్తగా ఏమీ చేయడం లేదన్నది ఆయన విశ్లేషణ. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌లో ఈ మేనిఫెస్టోల యుద్ధం ఎవరిని సింహాసనంపై కూర్చోబెడుతుందో చూడాలి.

===============

# అన్నం సరిపోలేదు మళ్లీ పెట్టమన్నందుకు ప్రిన్సిపాల్ దాష్టికం

## విద్యార్థినులను మోకాళ్ళ మీద కూర్చోబెట్టిన ప్రిన్సిపాల్

నల్గొండ మార్చి 31,

నల్గొండ జిల్లా దామరచర్ల బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలు అన్నం సరిపోలేదు మళ్లీ పెట్టమన్నందుకు రాత్రి 8 గంటల నుండి 9 గంటల వరకు మోకాళ్ళ మీద కూర్చోబెట్టి ప్రిన్సిపాల్ పైశాచికంగా వ్యవహరించింది. ఎక్కువ అన్నం ఎక్కువ కూరలు పెట్టలేమని.. విద్యార్థులు ఎవరైనా అన్నం సరిపోలేదు మళ్లీ పెట్టండి అంటే అందరికీ ఇదే గతని బెదిరింపులకు గురిచేసింది. విద్యార్థినులను చిత్రహింసలకు గురి చేస్తున్న ప్రిన్సిపాల్ ను డిస్మిస్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్

=====================

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website : www.scr.indianrailways.gov.in

**Notice Inviting e-Tender (through http://ireps.gov.in)** PUB/2199

భారత రాష్ట్రపతి తరపున సికింద్రాబాద్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో కింది పనుల కోసం ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01 ఎన్ఐటి సం.: సి/ఇ.29/టిఆర్డి/ఎస్సి/73/2025-26 పని పేరు: టెండర్ సం. సి/ఇ.29/టిఆర్డి/ఎస్సి/73/2025-26 తేది. 13.03.2026 ఎస్సి విభాగం: కెజెడ్జె-బిపిక్యూ సెక్షన్: టిఆర్డి ఏర్పాట్లు: 1. కాజీపేట-బల్హార్షా సెక్షన్‌లోని సిర్పూర్ టౌన్‌లో రైలు స్థాయి ప్లాట్‌ఫారమ్‌తో గూడ్స్ లోడింగ్ లైన్ ఏర్పాటు 2. కాజీపేట-బల్హార్షా సెక్షన్‌లోని సిర్పూర్ టౌన్ స్టేషన్‌లో బ్యాలస్ట్ డిపోను విస్తరించడం. అంచనా వ్యయం (రూ): 4,91,97,978.28 పూర్తి చేసే కాలం: 12 నెలలు చివరి తేదీ: 22.04.2026, మధ్యాహ్నం 3:00 గంటలకు

1) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం, దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి.
2) టెండర్దారులు కేవలం ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనాలి మరియు మాన్యువల్ ఆఫర్‌లు ఏవీ పరిగణించబడవు.
3) టెండర్ షరతులు/ఇతర వివరాలు IREPS వెబ్‌సైట్ ireps.gov.in లోని టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, పాల్గొనవచ్చు మరియు ఏవైనా మార్పులు ఉంటే వాటిని వీక్షించవచ్చు.
4) టెండర్లలో పాల్గొనబోయే వారందరూ టెండర్ ఫారం ఖర్చు మరియు EMDని ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరడమైనది.
5) టెండర్ నోటీసును సికింద్రాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్‌లోని సీనియర్ డిఈఈ/టిఆర్‌డి కార్యాలయంలో ఉన్న నోటీసు బోర్డులో కూడా ప్రదర్శిస్తారు, దీనిని అన్ని పని దినాలలో చూడవచ్చు.
6) ఎటువంటి కారణం చెప్పకుండా టెండరును రద్దు చేసే హక్కు రైల్వేకు ఉంది.
7) టెండర్లు వేయాలనుకునే వారందరూ GSTIN గుర్తింపు సంఖ్యలను పొంది, వాటిని తమ ఆఫర్లతో పాటు సమర్పించాలని సూచించడమైనది.
8) టెండర్ సమర్పణ గడువు ప్రారంభమయ్యే తేదీ వరకు టెండరర్ ఏవైనా సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) గమనిస్తూ ఉండాలి.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, టి.ఆర్.డి, సికింద్రాబాద్**

**Notice Inviting e-Tender (through http://ireps.gov.in)** PUB/2200

భారత రాష్ట్రపతి తరపున సికింద్రాబాద్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో కింది పనుల కోసం ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01 ఎన్ఐటి నెం.: సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/74/2025-26 పని పేరు: టెండర్ నెం. C/E.29/TRD/SC/74/2025-26 తేది. 24.03.2026 SC డివిజన్: SC డివిజన్‌లోని KZJ-WD సెక్షన్‌లో భద్రత & విశ్వసనీయతకు సంబంధించి వంగి ఉన్న/క్లిష్టమైన మరియు తక్కువ కాంటాక్ట్ వైర్ ఎత్తు ఉన్న OHE నిర్మాణాల సవరణ మరియు బలోపేతం. అంచనా వ్యయం (రూ): 5,40,15,787.08 పూర్తి కాల వ్యవధి: 12 నెలలు ముగింపు తేదీ: 21.04.2026 న 15:00 గంటలకు

క్ర.సం.: 02 ఎన్ఐటి నెం.: సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/టెండర్ నెం. సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/75/2025-75/2025-26 పని పేరు: 26 తేది. 24.03.2026 SC డివిజన్: SC డివిజన్‌లోని KI-BPQ విభాగంలో భద్రత & విశ్వసనీయతకు సంబంధించి వంగి ఉన్న/క్లిష్టమైన మరియు తక్కువ కాంటాక్ట్ వైర్ ఎత్తు ఉన్న OHE నిర్మాణాల సవరణ మరియు బలోపేతం. అంచనా వ్యయం (రూ): 6,31,35,166.08 పూర్తి చేసే కాలం: 12 నెలలు ముగింపు తేదీ: 21.04.2026, మధ్యాహ్నం 3:00 గంటలకు

1) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కోసం, దయచేసి http://ireps.gov.in వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి.
2) టెండర్దారులు కేవలం ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనాలి మరియు మాన్యువల్ ఆఫర్‌లు ఏవీ పరిగణించబడవు.
3) టెండర్ షరతులు/ఇతర వివరాలు IREPS వెబ్‌సైట్ ireps.gov.in లోని టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి, వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, పాల్గొనవచ్చు మరియు ఏవైనా మార్పులు ఉంటే వాటిని వీక్షించవచ్చు.
4) టెండర్లు వేయాలనుకునే వారందరూ GSTIN గుర్తింపు సంఖ్యలను పొంది, వాటిని తమ ఆఫర్లతో పాటు సమర్పించాలని సూచించడమైనది.
5) టెండర్ సమర్పణ గడువు ప్రారంభమయ్యే తేదీ వరకు టెండరర్ ఏవైనా సవరణల కోసం (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి) గమనిస్తూ ఉండాలి.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, టి.ఆర్.డి, సికింద్రాబాద్**

**Tender No. GTL-EM-87-2025-26, Date : 26.03.2026** PUB/2202

భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/మెయింటెనెన్స్/గుంతకల్, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నెం: GTL-EM-87-2025-26. పని పేరు: గుంతకల్ విభాగం: 1. VNM, HAQ, SF & KMH వద్ద ప్లాట్‌ఫారాలను ఉన్నత స్థాయికి పెంచడం మరియు కొత్త 3మీ FOB ఏర్పాటు - విద్యుత్ ఏర్పాట్లు., 2. ANE, KQA, OBVP, NRE & PMT వద్ద ప్లాట్‌ఫారాలను ఉన్నత స్థాయికి పెంచడం - విద్యుత్ ఏర్పాట్లు., 3. MMPL & BKPT వద్ద కొత్త 3మీ FOB ఏర్పాటు - విద్యుత్ ఏర్పాట్లు. 4. విద్యుత్ ఏర్పాట్లు - ప్రొద్దుటూరు మరియు జమ్ములమడుగు వద్ద 24/26 LHB కోచ్‌లను నిలిపి ఉంచడానికి ప్లాట్‌ఫారాన్ని విస్తరించడం సుమారు విలువ(రూ): 2,73,53,996.11/-

ముగింపు తేదీ మరియు సమయం: 17.04.2026, 15.00 గంటలకు

టెండర్ దాఖలు చేయడానికి మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in లోకి లాగిన్ అవ్వండి. టెండర్‌కు సంబంధించిన సవరణలు ఏవైనా ఉంటే, అవి ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి. టెండర్దారులు టెండర్ పత్రాన్ని http://www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్&**

**Tender Notice No. : CRS-E-16-25-26** PUB/2203

భారత రాష్ట్రపతి తరపున వ్యవహరిస్తున్న డిప్యూటీ చీఫ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్/కమర్షియల్ రెగ్యులేటరీ సర్వీసెస్/ప్రొడక్టివ్ టూరిజం అథారిటీ (DY.CME/CRS/TPTY/CRS/TPTY), ఇక్కడ పేర్కొన్న టెండర్ నెం:కు గాను, క్రింద పేర్కొన్న చివరి తేదీ అయిన ఉదయం 11:00 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తోంది. బిడ్డర్లు తమ అసలు/సవరించిన బిడ్లను చివరి తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు, మరియు స్వీకరించబడిన అటువంటి ఏదైనా మాన్యువల్ ఆఫర్ విస్మరించబడుతుంది.

క్ర.సం: 01 పని వివరణ: టెండర్ నెం: CRS-E-16-25-26 LHB AC కోచ్‌లలో RMPU FRP ట్రూ ఫ్లోర్‌ను SS ట్రూ ఫ్లోర్‌గా మార్చడం - 12 నెలల కాలానికి, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి, ఎస్.సి.రైల్వే వద్ద. సుమారు వ్యయం (రూ): 32,69,955/- బిడ్ సెక్యూరిటీ (రూ): 65,400/- పూర్తి చేసే కాలం: 12 నెలలు ముగింపు తేదీ: 17.04.2026, 11.00 గంటలకు

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in
టెండర్ పూర్తి వివరాలు చూడగలిగే నోటీసు బోర్డు స్థానం: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి
మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం (టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి) మరియు టెండర్ పత్రాలు, సవరణలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి మా వెబ్‌సైట్ https://www.ireps.gov.in ను సందర్శించండి.

**డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, సి.ఆర్.ఎస్ / తిరుపతి**

**Tender No. M248-PAINT-05, Dt. 28.03.2026** PUB/2206

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్/RYPS, సౌత్ సెంట్రల్ రైల్వే, వ్యాగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి-521 241 ఇ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నెం.: M248-PAINT-05-Dt28-03-26 వివరణ: గుంటుపల్లి, ఎస్.సి.ఎఫ్ రైల్వేలోని వ్యాగన్ వర్క్‌షాప్ ప్రాంగణంలో ఎస్ఎస్ ఓపెన్ వ్యాగన్లకు పీయూ పెయింటింగ్. పరిమాణం: టెండర్ పత్రంలో పేర్కొన్న విధంగా పూర్తిచేయు కాలపరిమితి: 12 నెలలు టెండర్ విలువ (రూ): 48,66,714.08/- (నలభై ఎనిమిది లక్షల అరవై ఆరు వేల ఏడు వందల పద్నాలుగు రూపాయల ఎనిమిది పైసలు మాత్రమే) ఈఎండీ (రూ): 97,300/- (తొంభై ఏడు వేల మూడు వందల రూపాయలు మాత్రమే) టెండర్ పత్రం ఖర్చు (రూ): ఉచితం ఆఫర్ చెల్లుబాటు : టెండర్ తెరిచిన తేదీ నుండి 60 రోజులు. టెండర్ రకం: ఐఆర్‌జీసీసీ-2022 ద్వారా నిర్వహించబడే పనుల టెండర్ టెండరింగ్ విధానం : ఓపెన్ టెండర్ - సింగిల్ ప్యాకెట్ టెండర్ ముగింపు సమయం & తేదీ: తేది. 15-00 గంటలకు. 22.04.2026 టెండర్ పత్రం మరియు సవరణ : వెబ్‌సైట్ "http://www.ireps.gov.in" ను సందర్శించండి. ఉత్తర ప్రత్యుత్తరాల కోసం పోస్టల్ చిరునామా: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, వాగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి-521241, ఆంధ్రప్రదేశ్

**డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, డబ్ల్యు.డబ్ల్యు.ఎస్, గుంతకల్**

A 2782

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి,
https://www.ireps.gov.in
లేదా
www.scr.indianrailways.gov.in
వెబ్‌సైట్‌ను సందర్శించండి

# గులాబీకి భారం అవుతున్న కౌశిక్...



కరీంనగర్ మార్చి 31,
కౌశిక్ రెడ్డి రాజకీయ ప్రవర్తన మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉంటోంది. ఓ సారి అరికెపూడి గాంధీ ఇంటి మీదకు వెళ్లారు. ఇప్పుడు కడియంపై అదే తరహా అగౌరవం ప్రవర్తనకు పాల్పడ్డారు. నిజానికి ఈ ఇద్దరు నేతలకు.. కౌశిక్ రెడ్డికి సంబంధంలేదు. కనీసం ఆయన జిల్లా వారు కూడా కాదు. కానీ కేటీఆర్ మెప్పు పొందేందుకు కౌశిక్ రెడ్డి ఇలా చేస్తున్నారు. కేటీఆర్ కూడా కౌశిక్ రెడ్డిని ప్రోత్సహిస్తున్నారు. ఆయన రెచ్చిపోతున్నారు.రాజకీయాల్లో సిద్ధాంతపరమైన విభేదాలు, విమర్శలు సహజం. కానీ, కౌశిక్ రెడ్డి అనుసరిస్తున్న తీరు ఇందుకు భిన్నంగా ఉంది. తన జిల్లాకు సంబంధం లేని నేతలైన కడియం శ్రీహరి లేదా అరికెపూడి గాంధీ వంటి వారిని లక్ష్యంగా చేసుకుని, వారి వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఒక ప్రజాప్రతినిధిగా సభలో వాడకూడని భాషను వాడటం, సీనియారిటీకి కనీస మర్యాద ఇవ్వకపోవడం వల్ల ఆయన ఇమేజ్ పక్కన పెడితే, సభా గౌరవం దెబ్బతింటోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లుగా, ఈ సంస్కృతిని ఇప్పుడే అదుపు చేయకపోతే భవిష్యత్తులో అసెంబ్లీ కుస్తీ పోటీలకు, భౌతిక దాడులకు వేదికగా మారే ప్రమాదం ఉందన్న ఆందోళనలో వాస్తవం లేకపోలేదు.కౌశిక్ రెడ్డి ఈ తరహా దూకుడు ప్రదర్శించడం వెనుక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మెప్పు పొందాలనే తాపత్రయం ఉంది. పార్టీలో తన ఉనికిని చాటుకోవడానికి, అధినాయకత్వం దృష్టిలో ఫైర్ బ్రాండ్ అనిపించుకోవడానికి ఆయన ఉద్దేశపూర్వకంగానే వివాదాలను కొనితెచ్చుకుంటున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఇలాంటి ప్రవర్తనను కేటీఆర్ గట్టిగా వారించాల్సింది పోయి, సమర్థించడం , ప్రోత్సహించడం వల్ల కౌశిక్ రెడ్డికి తన తప్పు తెలియడం లేదు. రాజకీయాల్లో దూకుడు అవసరమే కానీ, అది ప్రత్యర్థులపై పైచేయి సాధించడానికి ఉండాలి తప్ప, అసహ్యం కలిగించేలా ఉండకూడదు.ఏ పార్టీకైనా ఇలాంటి వివాదాస్పద నేతలు కొంతకాలం మైలేజీని ఇవ్వవచ్చు కానీ, దీర్ఘకాలంలో అది పార్టీ నైతికతను దెబ్బతీస్తుంది. నిశ్శబ్దంగా ఉండే తటస్థ ఓటర్లు, విద్యావంతులు ఇలాంటి భాషను, ప్రవర్తనను అసహ్యించుకుంటారు. కౌశిక్ రెడ్డి తీరు వల్ల బీఆర్ఎస్ ఒక క్రమశిక్షణ లేని పార్టీగా ప్రజల్లో ముద్ర పడే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీని మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయంలో, ఇలాంటి వివాదాలు అసలు చర్చను పక్కదారి పట్టించి పార్టీకి కోలుకోలేని నష్టాన్ని చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయ నాయకుడికి ఉండాల్సిన ప్రాథమిక లక్షణం సమయం-సందర్భం తెలియడం. కౌశిక్ రెడ్డి విషయంలో ఆ పరిణతి లోపించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తన దూకుడును పార్టీ ప్రయోజనాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వాడుకుంటే అది ఆయన రాజకీయ భవిష్యత్తుకు ప్లస్ అవుతుంది. కానీ, ఇలాగే వ్యక్తిగత దాడులకు దిగుతూ, సభా మర్యాదలను కాలరాస్తే.. అది ఆయన పతనానికే కాకుండా పార్టీ ప్రతిష్టకు కూడా గొడ్డలి పెట్టుగా మారుతుంది. ఈ విషయాన్ని గుర్తించాల్సింది వారే.

# భారీగా తగ్గిన ఇంజనీరింగ్ అప్లికేషన్స్

హైదరాబాద్ మార్చి 31, )
రాష్ట్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఈఏపీసెట్ 2026 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఆలస్య రుసుములేకుండా ఏప్రిల్ 4తో ముగియనున్నాయి. ఈ క్రమంలో ఈసారి ఈఏపీసెట్ దరఖాస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మార్చి 28 నాటికి ఇంజినీరింగ్‌కు 1,78,442 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి 73,782 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే గడువు ఏప్రిల్ 4తో ముగుస్తుంది. అంటే మరో 6 రోజులే సమయం ఉంది. ఆ తర్వాత ఆలస్య రుసుంతో మే 2 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ గత కొన్నేళ్ల గణాంకాలను పరిశీలిస్తే ఆ సంఖ్య 6 వేలకు మించదని తెలుస్తుంది. గత ఏడాది ఇంజినీరింగ్ విభాగానికి ఏకంగా 2.20 లక్షల దరఖాస్తులు అందాయి. ఇక అగ్రికల్చర్‌కు దాదాపు 87 వేలు వస్తాయి. మొత్తం కలిపి 3.07 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి ఇంజినీరింగ్‌కు 2 లక్షలు, అగ్రికల్చర్‌కు 80 వేల మంది లోపే దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో దాదాపు 30 వేల వరకు దరఖాస్తులు తక్కువగా వచ్చే అవకాశం ఉందని ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె విజయకుమార్‌రెడ్డి తెలిపారు.గత ఏడాది ఏపీ విద్యార్థులు భారీగా దరఖాస్తు చేసుకోవడం వల్ల దరఖాస్తుల సంఖ్య పెరిగింది. ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు మే 9 నుంచి 11 వరకు జరుగుతాయి. ఇక ఆ మరుసటి రోజు నుంచే అంటే మే 12 నుంచి ఏపీ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు మొదలవుతాయి. దీంతో ఈసారి ఏపీ విద్యార్థుల సంఖ్య తగ్గింది. గత ఏడాది ఇంజినీరింగ్‌కు 17,834 మంది, అగ్రికల్చర్‌కు 2,877 మంది ఇతర రాష్ట్రాల విద్యార్థులు దరఖాస్తు చేశారు. ఈసారి ఇప్పటివరకు ఇంజినీరింగ్‌కు 8 వేలు, అగ్రికల్చర్‌కు 1400 మంది మాత్రమే దరఖాస్తు చేశారు.
ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 4, 2026.
రూ.250 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2026.
రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 15, 2026.
రూ.2,500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 20, 2026.
రూ.5,000 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 24, 2026.
రూ.10,000 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ: మే 2, 2026 వరకు
దరఖాస్తు సవరణ: ఏప్రిల్ 6 నుంచి 8 వరకు.
అగ్రికల్చర్, ఫార్మసీ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: ఏప్రిల్ 23, 2026.
ఇంజినీరింగ్ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేదీ: ఏప్రిల్ 27, 2026.
అగ్రికల్చర్ ఉ ఫార్మసీ పరీక్ష తేదీలు: మే 4, 5 తేదీల్లో

# బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే ఇదంతా: హరీష్ రావు

హైదరాబాద్‌మార్చి 31,
రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.
కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పింది. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టారని అన్నారు.
ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా. సీఆర్ పాటిల్ ఒకసారి తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను అడిగితే, నీళ్లు ఎప్పుడు వచ్చాయి, ఎలా వచ్చాయని స్పష్టంగా తెలుస్తుంది. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికి కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారు. ఒక్క 50 కోట్లు ఇస్తే ఇంకొక 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని, రెండేళ్ల నుండి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తలేదు . మాకు మా మీద కోపం ఉంటే తీర్చుకోండి కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపకండని అన్నారు.

# మహాలక్ష్మి పథకంతో 290 కోట్ల ఉచిత ప్రయాణాల ద్వారా మహిళామణులకు 10 వేల కోట్ల రూపాయల ఆదా :

## జూబ్లీ బస్ స్టేషన్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ మార్చి 31,
అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళా సోదరీమణులకు ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 24 గంటల లోపు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయగా ఈ పథకం ద్వారా ఈరోజు వరకు రాష్ట్రంలో 290 కోట్ల ప్రయాణాల ద్వారా 10 వేల కోట్ల రూపాయలను మహిళా సోదరీమణులు ఆదా చేసుకున్నారు . రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఖీఖ సంస్థ జూబ్లీ బస్ స్టేషన్ లో మహిళా సోదరీమణులను సన్మానించడానికి ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అధికారులు ఎమ్మెల్యే శ్రీగణేష్ ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంతో ఎమ్మెల్యే హాజరై మహిళా సోదరీమణులను సన్మానించారు.

# రాఘవ చుట్టూ రాజకీయం

హైదరాబాద్ మార్చి 31,
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వివాదం రోజురోజుకు ముదురుతోంది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ.. అక్రమ మైనింగ్ వ్యవహారం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. దీనిపై బీఆర్ఎస్ భారీ పోరాటం చేస్తోంది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై.. హౌస్ కమిటీ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కారు పార్టీ డిమాండ్ చేస్తోంది. మంత్రి పొంగులేటిని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని.. అక్రమంగా నడుస్తున్న క్రషర్ యూనిట్లను సీజ్ చేయాలని పట్టుబట్టింది బీఆర్ఎస్.రాజేంద్రనగర్ మండలం కొత్వాల్‌గూడ మానస హిల్స్ ప్రాంతంలో.. ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ క్రషర్ యూనిట్లను నడుపుతోందన్నది బీఆర్ఎస్ ఆరోపణ. దీనికి పర్యావరణ అనుమతులు లేవని.. జీవో నంబర్ 111 పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో అక్రమంగా క్వారీయింగ్ చేస్తున్నారని గులాబీ పార్టీ చాలా కాలంగా ఆరోపిస్తూ వస్తోంది. క్రషర్ వ్యవహారంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులతో ఓ నిజ నిర్ధారణ కమిటీ వేసింది బీఆర్ఎస్. మానసా హిల్స్‌లోని క్రషర్ ప్రాంతాన్ని ఈ కమిటీ రెండుసార్లు సందర్శించింది కూడా ఐతే తాము ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీ పర్యటనకు ముందే.. అక్కడున్న కంటైనర్లపై రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పేర్లను చెరిపేసి.. సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేశారన్నది బీఆర్ఎస్ నేతల ఆరోపణ. ఇదే అంశాన్ని ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనూ లేవనెత్తింది. ఈ అంశంపై గులాబీ పార్టీ నేతలు రెండు రోజులపాటు నిరసన తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ క్రషర్ అక్రమ మైనింగ్‌పై చర్చకు సీరియస్‌గా పట్టుబట్టారు. నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియంను చుట్టుముట్టడంతో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజులు సస్పెండ్ చేశారు.అంతకుముందు కేటీఆర్, హరీశ్ నేతృత్వంలో.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ దగ్గర ప్లకార్డులతో నిరసన తెలిపారు. దీంతో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్ వ్యవహారం.. రాజకీయ రచ్చకు కారణం అవుతోంది. ఐతే బీఆర్ఎస్ ఆరోపణలను.. సీఎం రేవంత్ తిప్పికొడుతున్నారు. గత 12ఏళ్లుగా జరిగిన మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన మైనింగ్ లీజుల అక్రమాలను కూడా బయటపెడతామని సవాల్ విసిరారు. అటు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు కూడా.. ఆరోపణలను తోసి పుచ్చారు. తాము కేవలం ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం నిబంధనల ప్రకారమే పని చేస్తున్నామని.. రాజకీయ కక్షతోనే తమపై బురద జల్లుతున్నారని అంటున్నారు.పొంగులేటి టార్గెట్‌గా బీఆర్ఎస్ చూపిస్తున్న దూకుడు.. ఇప్పుడు రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. అసలు పొంగులేటి మీద ఈ రేంజ్‌లో ఎందుకు ఫోకస్ చేస్తుందనే డిస్కషన్ నడుస్తోంది. ఐతే పొంగులేటి ఇష్యూను.. బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకోవడం వెనక బలమైన కారణం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక అవకతవకలు జరిగాయని.. వివిధ శాఖల్లో సుమారు 19 స్కామ్‌లు జరిగాయని ఆరోపిస్తున్న కారు పార్టీ.. వాటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తోంది. ఐతే వీటిలో ఒక్కదానికి కూడా ఆధారాలు లేవు. ఇలాంటి సమయంలో మంత్రి పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ క్రషర్ వ్యవహారం.. కారు పార్టీకి ఆయుధంగా మారింది. ఆ క్రషర్‌కు అనుమతులు లేవని చెప్పడానికి.. పలుమార్లు నోటీసులు జారీ చేయడం, జరిమానా విధించడానికి సంబంధించి పూర్తి ఆధారాలు దొరికాయ్. దీంతో ఈ వ్యవహారాన్ని అంత ఈజీగా వదలొద్దని బీఆర్ఎస్ డిసైడ్ అయిందని టాక్.మంత్రి పొంగులేటి కుటుంబసభ్యులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్న వట్టినాగులపల్లి భూములను.. పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్, హరీశ్‌రావు స్వయంగా సందర్శించారు. ఆ తర్వాత లోక్‌భవన్ వెళ్లి.. గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. మంత్రి పొంగులేటి అక్రమ క్రషర్లు నడుపుతున్నారని.. హైదరాబాద్‌లో భూకబ్జాలకు పాల్పడుతున్నారని.. ఆయనను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ.. గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అటు అసెంబ్లీలో.. ఇటు బయటా.. ఇలా వదిలేదే లే అనే రేంజ్‌లో పొంగులేటిని టార్గెట్ చేస్తోంది బీఆర్ఎస్. ఈ అంశాన్ని ప్రభుత్వంపై ప్రధాన అస్త్రంగా బీఆర్ఎస్ వాడుతుంటే.. పాత ప్రభుత్వ అక్రమాలతో ముడిపెట్టి కాంగ్రెస్ ఎదురుదాడి చేస్తోంది. దీంతో రాజకీయ రచ్చ రోజురోజుకు ముదురుతోంది.




# 30 వేల ఎకరాల ల్యాండ్ ఎక్విజేషన్.. అనుకున్నంత ఈజీ కాదా

హైదరాబాద్ మార్చి 31,
ముచ్చర్ల కేంద్రంగా సుమారు 30,000 ఎకరాల్లో విస్తరించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రకటనతో స్థానిక రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒక రకమైన స్తబ్దత, అదే సమయంలో తీవ్రమైన ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా ఏఐ సిటీ, హెల్త్ సిటీ , నెట్ జీరో సిటీ వంటి భారీ జోన్ల ఏర్పాటు ఖరారు కావడంతో, ముచ్చర్ల చుట్టుపక్కల 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వ్యవసాయ భూముల అమ్మకాలు దాదాపుగా నిలిచిపోయాయి. అటు రైతులు తమ భూములకు భవిష్యత్తులో మరింత ధర వస్తుందని ఆగుతుండగా, ఇటు ఇన్వెస్టర్లు ప్రభుత్వ ల్యాండ్ పూలింగ్ నిబంధనలు ఎలా ఉంటాయోనని వేచి చూస్తున్నారు.ప్రభుత్వం ఇక్కడ అమరావతి తరహాలో ల్యాండ్ పూలింగ్ విధానాన్ని పరిశీలిస్తుండటం ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. ఈ విధానంలో రైతులు లేదా యజమానుల నుంచి భూమిని తీసుకుని, దానిని అభివృద్ధి చేసిన తర్వాత కొంత భాగాన్ని తిరిగి వారికే కేటాయిస్తారు. అయితే, ఇప్పటికే అక్కడ ప్లాట్లు కొన్న ఇన్వెస్టర్లు తమ భూమి ఏ జోన్‌లోకి వెళ్తుంది? ప్రభుత్వం ఇచ్చే లేఅవుట్ ఎక్కడ ఉంటుంది? అనే గందరగోళంలో ఉన్నారు. ఈ స్పష్టత వచ్చే వరకు కొత్త రిజిస్ట్రేషన్లు చేయడం కంటే, ఉన్న భూమిని కాపాడుకోవడం మిన్న అని రియల్టర్లు భావిస్తున్నారు.ఫ్యూచర్ సిటీ ప్రభావం కేవలం ముచ్చర్లకే పరిమితం కాకుండా, కందుకూర్, యాచారం, మహేశ్వరం , ఆమనగల్ వరకు పాకింది. 20 కిలోమీటర్ల రేడియస్‌లో ఎక్కడ చూసినా ఫ్యూచర్ సిటీ కి చేరువలో ఉన్న వెంచర్ల గురించే చర్చ జరుగుతోంది. శ్రీశైలం హైవే , నాగార్జున సాగర్ హైవేలను కలిపేలా ప్రతిపాదించిన 41 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ఈ ప్రాంతపు రూపురేఖలను మార్చబోతోంది. దీంతో ఎకరం ధర కొన్ని చోట్ల కోట్లకు చేరుకోగా, చిన్న ఇన్వెస్టర్లు మాత్రం ఇప్పుడు అడుగు పెట్టాలా వద్దా అనే సందిగ్ధంలో పడ్డారు.తెలంగాణ ప్రభుత్వం దీనిని కేవలం ఒక సిటీగా కాకుండా, భారతదేశపు మొదటి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. గ్లోబల్ ఏఐ సమ్మిట్ తర్వాత అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ డేటా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతుండటంతో భూములు ఉన్న వాళ్లు చాలా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.
===================

# కమిషనర్ పై చర్యలకోసం సచివాలయం ఉద్యోగుల నిరసన

పిఠాపురం మార్చి 31,
సచివాలయ ఉద్యోగులను బూతులు తిట్టిన కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని పిఠాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగులు బైఠాయించారు. కమిషనర్ ను తక్షణమే విధుల నుంచి తొలగించి బాధ్యత సచివాలయ ఉద్యోగికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. కాకినాడ జిల్లా, పిఠాపురం పురపాలక సంఘం కమిషనర్ కనకారావు పదో వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శి సుధీర్ పై బూతులు తిడుతూ అసభ్య పదజాలం ఉపయోగించడం పై సచివాలయం ఉద్యోగులు రాష్ట్ర సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. సచివాలయ ఉద్యోగుల పట్ల కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు సరికాదని సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ సచివాలయ ఉద్యోగులపై దుర్భుద్ధమైన పదజాలం ఉపయోగించడం తగదు. సచివాలయం ఉద్యోగులను బూతులు తిట్టిన కమిషనర్ను పై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ సచివాలయ కింది స్థాయి ఉద్యోగులపై కమిషనర్ చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా పలు సచివాలయాల్లో ఇదే విధంగా కమిషనర్ వ్యవహరించారని మహిళా ఉద్యోగులు సైతం తమవద్ద ఆవేదన వ్యక్తం చేసినట్టు ఆయన మీడియాకు తెలిపిన వైనం. సచివాలయ శానిటేషన్ కార్యదర్శి సుధీర్ మాట్లాడుతూ కేవలం తను దళిత కులస్తుడనే ఒకే ఒక కారణంతో కమిషనర్ తనను తన తల్లిని కించపరిచి మాట్లాడడం బాధాకరమన్నారు. తాను విధి నిర్వహణలో లోపాలు ఉంటే శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని అలా కాకుండా తనను తను తల్లిని తిట్టడం ఏమిటి అని ఆవేదన చెందాడు.

# ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్తే జస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 31: సూర్యాపేట జిల్లా హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.



మంగళవారం హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోనీ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీ ని, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ ల అధికారులను ఆదేశించారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు హౌసింగ్ పీడీ సిద్ధార్థ,మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన--2027 తొలి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి : డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 31: జనగణన--2027 తొలి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జనగణన అధికారులతో జనగణన, ఇండ్ల గణన విధానాలు, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు సూపర్వైజర్ల నియామకంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.




ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనగణన కార్యక్రమంలో ఇండ్ల గణనను కచ్చితంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ పద్ధతిలో గణన చేపట్టాలని సూచించారు. దేశంలో తొలిసారిగా జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని పేర్కొన్నారు.

మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, ఈ సమయంలో కుటుంబాల వివరాలను పూర్తిగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ముందస్తు సన్నాహక పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. యాప్ నిర్వహణలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే పరిష్కరించాలని సూచించారు.

మండలాల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టి, ఎన్యుమరేటర్ బ్లాక్/హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లను రూపొందించాలని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, ఇప్పటికే సంబంధిత అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో జనగణన--2027 తొలి విడత ఇండ్ల గణనను అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తామని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు.

# హనుమాన్ జయంతి ర్యాలీ మార్గాన్ని స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 31: ఏప్రిల్ 02న హనుమాన్ జయంతి సందర్భంగా కామారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న శోభాయాత్ర మార్గం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపిఎస్, మంగళవారం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమీక్షించారు.

ర్యాలీ సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించి పలు కీలక సూచనలు చేశారు. వివిధ శాఖల అధికారులతో కలిసి ర్యాలీ సాగే రూట్ మ్యాప్‌ను పరిశీలించిన వారు, మార్గంలోని ప్రధాన కూడళ్లను సందర్శించి ట్రాఫిక్ నియంత్రణ , బందోబస్తు ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు.

అనంతరం ర్యాలీ నిర్వహణ ప్రతినిధులతో కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వేడుకలను క్రమశిక్షణతో నిర్వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ, పట్టణంలోని ముఖ్య మార్గాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్ కెమెరాలు , సీసీటీవీల ద్వారా నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు.

ఇతరులకు ఇబ్బంది కలగకుండా భక్తులు , నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఐపిఎస్, ఎస్.హెచ్.ఓ నరహరి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్ , ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి,మహిళా సంఘాలే స్త్రీ శక్తికి నిదర్శనం :కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 31(భారత శక్తి): ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం మహిళలకు గొప్ప వరం లాంటిదని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళల జీవితాలలో వెలకట్టలేని మార్పును తీసుకువచ్చిందని తెలిపారు.






మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం - ఉత్సవాలు 2026" కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 29 నాటికి 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలను ఆధా చేసుకున్నారని అన్నారు.

ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, జిల్లాలో ఇప్పటి వరకు 1 కోటి 90 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.

మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నామని, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని, ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో "ఇందిరా మహిళా శక్తి" పథకం ను అమలు చేస్తూ ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో

మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ,

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, ఆర్టీసీ డి.ఎం. రవిచందర్, అడిషనల్ డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# టిబి ముక్త భారత్ రెండో విడత కార్యక్రమం ప్రారంభం

### -14 సంవత్సరాల నిండిన బాలికలకు హెచ్ వి పి టీకా

### వెయ్యాలి : డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్. గోపాల్ రావు

ములుగు జిల్లా ప్రతినిధి ప్రతినిధి, మార్చి 31(భారత శక్తి): ఏప్రిల్ ఒకటో తేదీ నుండి "హ్యూమన్ ప్యాపిలోమా వైరస్- వాక్సినేషన్ డ్రైవ్ " తో పాటు 14 సంవత్సరాల దాటిన బాలికలకు హెచ్ వి పి టీకా వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ గోపాల్ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైద్యశాఖ సమావేశపు హాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, సూపర్వైజర్లు లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి ముక్త భారత్ రెండవ విడత 100 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, హెచ్. పి. వి టీకా ద్వారా గర్భాశయ క్యాన్సర్ ను నివారించవచ్చని అన్నారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల పరిధిగా 14 సంవత్సరాలు నిండిన బాలికల జాబితాను తయారు చేసి దానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, జిల్లాలో ఎంపిక చేయబడిన 20 గ్రామాలలో 14 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి తెమడ, చెస్ట్ ఎక్రే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో



జిల్లా వ్యాధి నిరోధక టీకాల నియంత్రణాధికారి డాక్టర్. నాగ అనేష్, మాస్ మీడియా అధికారి సంపత్, డిడిఎం ప్రవీణ్ పాల్గొన్నారు.

# క్షౌరశాలల విద్యుత్ బిల్లుల వసూళ్లను నిలిపివేస్తూ, ప్రభుత్వం సబ్సిడీ బిల్లు వెంటనే విడుదల చేయాలి: జంపాల రవీందర్

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 31 (భారత శక్తి):క్షౌరశాలల విద్యుత్తు బిల్లుల వసూళ్లను నిలిపివేస్తూ,ప్రభుత్వం క్షౌరశాలల విద్యుత్ సబ్సిడీ బిల్లులను వెంటనే విడుదల చెయ్యాలని నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జంపాల రవీందర్ అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలో ట్రాన్స్కో ఎస్సీ ఆనంద్ కు సంఘం ఆధ్వర్యంలోని నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో క్షౌరశాలలకు విద్యుత్ సబ్సిడీ అమలు చేశారని, నేటి ప్రభుత్వం విద్యుత్ బిల్లులను వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వసూళ్లను నిలిపివేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.కార్యక్రమంలో సంఘం ములుగు మండల అధ్యక్షులు వేల్పకొండ శరబంధం, మురహరి రామకృష్ణ, పట్టణ శాఖ అధ్యక్షులు మండల సంపత్, ఉపాధ్యక్షులు వేల్పుగొండ సతీష్, తదితరులు పాల్గొన్నారు.



# హుజుర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 31:
నూతన పాలకవర్గం హుజుర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 - 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం హుజుర్ నగర్ మున్సిపాలిటీ లో నిర్వహించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి సత్ఫలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు. హుజుర్నగర్ మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పరిశ్యుధ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆర్డిఓ కు సూచించారు.వార్డులలోని ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళ భద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీలలో సమర్థవంతంగా నిర్వహించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు.
కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ఘనంగా మహావీర జయంతి వేడుకలు

**-మహనీయుల ఆశ సాధనకు నేటి తరం కంకణ బదులు కావాలి**

**-మెట్టుశ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువజన సంఘాల సమితి.**



పటాన్ చెరువు , మార్చి 31 (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలో 24వ తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుడి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. యువజన వికాస సమితి న్యాయవాది విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ పాల్గొని మహావీరుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.
?ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ
"ప్రపంచ శాంతి కోసం, మానవాళి మనుగడ కోసం మహావీరుడు బోధించిన అహింస, సత్యం, ఇంద్రియ నిగ్రహం నేటి సమాజానికి ఎంతో అవసరం. కేవలం 30 ఏళ్ల వయసులోనే రాజ్య భోగాలను త్యజించి,12 ఏళ్ల కఠిన తపస్సుతో జ్ఞానోదయం పొందిన మహావీరుడు, 'బ్రతుకు - బ్రతికించు' అనే గొప్ప సూత్రాన్ని ప్రపంచానికి అందించారు.
?నేటి స్వార్థపూరిత సమాజంలో మనుషులు ఆస్తులు, అంతస్తుల కోసం కన్నతల్లిదండ్రులను కూడా విస్మరిస్తున్న తరుణంలో, మహావీరుడి బోధనలు మనందరికీ మార్గదర్శకంగా నిలుస్తాయి. ప్రతి జీవికి జీవించే హక్కు ఉందని చాటిచెప్పిన ఆయన ఆశయ సాధన కోసం మనమందరం కృషి చేయాలి. మన చుట్టూ ఉన్న ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, సమాజం దోపిడీ రహితంగా ఉండాలని కోరుకుంటున్నాను అని ఆయన పేర్కొన్నారు.
?ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ గౌడ్.ఎస్,షణ్ముఖ్, శంకర్, పి.సత్యనారాయణ, ప్రభు .వి,ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చి 31(భారత శక్తి):పోలీసు శాఖలో సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించి, నేడు పదవి విరమణ పొందుతున్న డల్లు సింగ్ (ఎ ఎస్ ఐ ), శంకర్ ( ఎ ఎస్ ఐ), మారుతి ( ఎ ఎస్ ఐ ), నారాయణ రెడ్డి ( ఎ ఎస్ ఐ), లను, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్, జిల్లా పోలీసు కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 1986 సంవత్సరంలో కానిస్టేబుల్ గా పోలీసు శాఖలో చేరిన బి.డల్లు సింగ్ ( ఎ ఎస్ ఐ - 1419) సోన్,40 సంవత్సరాలు,1990 సంవత్సరంలో కానిస్టేబుల్ గా పోలీసు శాఖలో చేరిన జి.శంకర్,( ఎ ఎస్ ఐ - 408), లోకేశ్వరం,36 సంవత్సరాలు,1990 సంవత్సరంలో కానిస్టేబుల్ గా పోలీసు శాఖలో చేరిన జెడ్. మారుతి (ఎ ఎస్ ఐ - 2355) భైంసా రూరల్,37 సంవత్సరాలు, 1989 సంవత్సరంలో కానిస్టేబుల్ గా పోలీసు శాఖలో చేరిన బి.నారాయణ రెడ్డి ( ఎ ఎస్ ఐ - 1658) లక్ష్మణ చందా,37 సంవత్సరాలు, వీరందరూ సుదీర్ఘ కాలం పాటు అంకితభావంతో సేవలు అందించి ఈరోజు పదవీ విరమణ చేశారు.
వారు పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడుతూ, విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతాయుత సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితి గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకుని, భవిష్యత్తులో మంచి ఆరోగ్యం, శాంతియుత జీవితం గడపాలని శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు, ఏవో యూనుస్ అలీ, పోలీస్ ఆఫీసర్స్ అధ్యక్షులు విరాసత్ అలీ,సిబ్బంది ఉన్నారు.



# బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, కేంద్రంగా అభివృద్ధి చేస్తాం: రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు.

## గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చి 31(భారత శక్తి): బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు. ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు. ఆ తర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి బాసర పర్యటన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మత్తు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన చర్యలు



చేపడతామని తెలిపారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదేవతల ప్రతిష్టాపనకు జిన్నారం సీఐ, ఎస్ఐ లకు ఆహ్వానం పలికిన

## డా. నల్లగండ్ల అశోక్ కుమార్ పటేల్

గడ్డపోతారం మున్సిపల్, మార్చి 31 (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ 17వ వార్డు చౌదరి గూడెం గ్రామంలో ఏప్రిల్ 03 శుక్రవారం రోజున గ్రామదేవతల ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమానికి జిన్నారం మున్సిపల్ కేంద్రానికి చెందిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సి.ఐ) రమణ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఎస్.ఐ) హనుమంతు లను గ్రామదేవతల ప్రతిష్ట బొడ్రాయి పండగ కార్యక్రమానికి అతిథులుగా రావాల్సిందిగా కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని చైర్మన్ డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్ పాటిల్ వారికి అందించి ఆహ్వానించడం జరిగింది.



# అందుకే ఎన్టీఆర్ 'డ్రాగన్'లో నేను నటించట్లేదు: టొవినో థామస్

హైదరాబాద్: టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు



చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. " తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా" అని వివరించారు. 15 ఏళ్ల కెరీర్‌లోనే 55కిపైగా సినిమాల్లో నటించడం గురించి చెబుతూ.. "కెరీర్ తొలినాళ్లలో ఇతర హీరోల సినిమాల్లో చిన్న పాత్రలు పోషించేవాడిని. 2014లో లీడ్‌రోల్ చేసిన మూవీ విడుదలైంది. ఆ తర్వాత కూడా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా నటిస్తూనే ఉన్నా. ఒకవేళ హీరోగానే చేయాలి అని ఫిక్స్ అయి ఉంటే ఇన్ని సినిమాలు వచ్చి ఉండేవి కాదు" అని అన్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.

## సినిమా

## అలా బతికి బయటపడ్డా!

బాలీవుడ్ నటి లారా దత్తా తన తొలి చిత్రం అందాజ్ షూటింగ్ సమయంలో ఎదుర్కొన్న ప్రాణాపాయ ఘటనను వివరించింది. సముద్రంలో డ్యాన్స్ సన్నివేశం చిత్రీకరిస్తుండగా తీవ్ర అలలు ఒక్కసారిగా ఎగసిపడటంతో ఆమె అక్షయ్ కుమార్‌తో కలిసి లోతు నీటిలోకి కొట్టుకుపోయింది. ఈత రాని పరిస్థితిలో లెదర్ దుస్తులు ధరించి ఉండటంతో బరువై నీటిలో పూర్తిగా మునిగిపోయానని, రాయిలా దిగిపోయానని ఆమె గుర్తుచేసుకుంది. కొద్ది సేపట్లోనే పరిస్థితి విషమించడంతో అక్షయ్ కుమార్ వెంటనే స్పందించి ఆమెను పట్టుకుని తీరానికి తీసుకువచ్చి ప్రాణాలు కాపాడాడు. ఘటన అనంతరం లారా తీవ్ర చలికి గురై హైపోథర్మియా షాక్‌కు లోనవ్వడంతో యూనిట్ వెంటనే షూటింగ్ నిలిపివేసి ఆసుపత్రికి తరలించింది. ఈ సంఘటనతో భయపడిన లారా తర్వాత కూడా తన భయాన్ని జయించేందుకు ప్రయత్నించింది. అక్షయ్ సూచనతో 30 ఏళ్ల వయసులో ఈత నేర్చుకుని, సముద్రంలో చిత్రీకరణ అవసరమైన బ్లూ సినిమాలో నటించింది. అందాజ్ సినిమా 2003లో విడుదలైన బాలీవుడ్ ప్రేమకథా చిత్రం. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్,




లారా దత్తా, ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రల్లో నటించారు. రాజ్ కన్వర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు నదీమ్‌శ్రవణ్ సంగీతం అందించారు.




## స్పానిష్‌లో రీమేక్

మలయాళ థ్రిల్లర్ మూవీ 'దృశ్యం' ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. ఇప్పటికే తెలుగు, కన్నడ, తమిళం, హిందీ భాషలతోపాటు శ్రీలంక, చైనాలోనూ రీమేక్ అయ్యింది. తాజాగా ఈ చిత్రాన్ని స్పానిష్‌లో తెరకెక్కించనున్నట్లు నిర్మాత రోడ్రిగో ఎస్పినెల్ ఢిల్లీ ఫిల్మ్ ఫెస్టివల్ లో వెల్లడించారు. 'ఇదొక ఇంట్రెస్టింగ్ స్టోరీ. ఎందుకంటే నా భాగస్వామి ఒక మెక్సికన్ నిర్మాత. ఆయన ఐపీ హక్కులను కొనుగోలు చేశారు. స్పెయిన్‌లో అద్భుతమైన పన్ను ప్రోత్సాహకాలు ఉండటంతో ఆయనే మమ్మల్ని సంప్రదించారు. స్పానిష్ కల్చర్ కు అనుగుణంగా మార్పులు చేస్తం. జూన్‌లో షూటింగ్ ప్రారంభిస్తం. ఈ ప్రాజెక్టులో స్పానిష్ దర్శకుడు, అగ్రశ్రేణి స్పానిష్ నటీనటులు ఉన్నారు' అని తెలిపారు. ఇక మోహన్‌లాల్ హీరోగా నటించిన 'దృశ్యం3' మే 21న విడుదల కానుంది. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో ఈ మూవీ రూపొందిన సంగతి తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వచ్చిన 'దృశ్యం' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు మూడో భాగం అలరించేందుకు సిద్ధమైంది. మరోవైపు హిందీ 'దృశ్యం3' కూడా షూటింగ్ శరవేగంగా జరుపుకొంటోంది. అజయ్ దేవ్‌గణ్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 2న రిలీజ్‌కానుంది.

# హాటెస్ట్ క్యారెక్టర్

సూపర్ స్టార్ మహేశ్ బాబు '1 నేనొక్కడినే' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ కృతి సనన్. ఆ తర్వాత దోచేయ్, ఆది పురుష్‌లో నటించింది. గతేడాది 'అమరకావ్యం'తోనూ తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఎప్పటికప్పుడు డిఫరెంట్‌స్టోరీలతో అలరించే ఈ అందాల తార ప్రస్తుతం కాక్ టైల్ 2 సినిమాతో బిజీగా ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కెరీర్ మొదట్లో సవాళ్ల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది కృతి. 'తొలి నాళ్లలో నాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. 'నువ్వు నవ్వినప్పుడు నీ చిగుళ్లు ఎక్కువగా కనిపిస్తాయి'.. ఇలా ఎన్నో మాటలు వింటూ ఉండేదాన్ని. ఇక్కడ మిమ్మల్ని మీరు నమ్మడమే మీ సూపర్ పవర్. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. విమర్శల్ని అధిగమించకపోతే.. మార్పు ఎలా తీసుకురాగలం. అందుకే మనసు మాట వింటూ కష్టపడుతూ పనిచేసుకోవాలి. 'కాక్ టైల్ 2లో నా క్యారెక్టర్ చాలా భిన్నంగా ఉంటుంది. నా పర్సనాలిటీలో నాకే తెలియని యాంగిల్ ను డైరెక్టర్ అదజానియా చూపించారు. బహుశా నా కెరీర్ లో హాటెస్ట్ క్యారెక్టర్ ఇదే. కాక్ టైల్ 2, కాక్‌టైల్ స్టోరీలైన్స్ వేర్వేరు. వైబ్ మాత్రం సేమ్ ఉంటుంది. ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయితో స్టోరీ నడుస్తుంది. ఇక నేషనల్‌క్రష్ రష్మిక కూడా నటిస్తున్న కాక్‌టైల్ 2 మూవీ ఏడాది జూన్ 19న రిలీజ్ కానుంది.



## 'ధురంధర్'ను దాటేసిన 'ధురంధర్ 2..

## కర్ణాటకలో సరికొత్త రికార్డు




వసూళ్ల విషయంలో 'ధురంధర్'ను 'ధురంధర్ 2' దాటేసింది. 12 రోజుల్లోనే ఫస్ట్ పార్ట్‌ను మించిన కలెక్షన్లు రాబట్టింది. ఈ నెల 19న బాక్సాఫీసు ముందుకొచ్చిన 'ధురంధర్: ది రివెంజ్' ఇప్పటి వరకూ రూ.1390+ కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది విడుదలైన 'ధురంధర్' లైఫ్‌టైమ్ కలెక్షన్లు: రూ.1350+ కోట్లు (గ్రాస్). అత్యధిక వసూలు చేసిన భారతీయ చిత్రాల జాబితాలో నిన్నటి వరకూ 'ధురంధర్' నాలుగో స్థానంలో ఉండగా.. ఇప్పుడా స్థానంలో 'ధురంధర్ 2' చేరింది. రూ.2000+ కోట్లతో తొలిస్థానంలో 'దంగల్' ఉండగా.. తదుపరి స్థానాల్లో 'బాహుబలి 2' (రూ.1810+ కోట్లు), 'పుష్ప 2' (రూ.1800+ కోట్లు) ఉన్న సంగతి తెలిసిందే. 12 రోజుల్లోనే టాప్ 4లోకి వచ్చిన 'ధురంధర్ 2'.. టాప్ 3కి చేరాలంటే దాదాపు రూ.400 కోట్లు రాబట్టాలి. హీరో రణ్‌వీర్ సింగ్ సహా ఇందులో నటించిన వారికి, దర్శకుడు ఆదిత్యధర్‌ల క్రేజ్ అమాంతం పెరిగింది.

**కర్ణాటకలో ఇలా..**

కర్ణాటకలో రూ.100+ కోట్లు కలెక్ట్ చేసిన తొలి హిందీ సినిమాగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డు నెలకొల్పింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం హిందీలోనే విడుదలైన 'ధురంధర్' రూ.1350+ కోట్లు రాబట్టడం ఓ రికార్డు అయితే.. పార్ట్ 1, పార్ట్ 2 చిత్రాలు అత్యధిక వసూలు చేసిన సినిమాల జాబితాలో ముందు వరుసలో నిలవడం మరో రికార్డు. ఈ అరుదైన రికార్డు మరే సినిమాకీ దక్కలేదు. దంగల్‌ను మినహాయిస్తే.. 'బాహుబలి 2', 'పుష్ప 2', 'ధురంధర్ 2' ఒకే కోవలోకి వస్తాయి. అదే సీక్వెల్. రెండు భాగాలుగా తీసినా.. నిడివి ఎక్కువైనా బలమైన కంటెంట్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారన్నది మరోసారి రుజువైంది.

## నయనతార.. ఆ రూమర్లు నిజమాయె




బాలీవుడ్ ప్రముఖ నటుడు సల్మాన్‌ఖాన్ హీరోగా టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి ఓ సినిమాని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు రూమర్లు చక్కర్లు కొట్టాయి. చిత్ర బృందం అధికారిక ప్రకటనతో అవి నిజమయ్యాయి. 'క్వీన్ వచ్చింది' అంటూ శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. నయనతార రెండు దశాబ్దాలుగా పైగా హీరోయిన్‌గా కొనసాగుతుండటం విశేషం. ఇప్పటికే 75కుపైగా చిత్రాల్లో నటించిన ఆమె.. ఈ సంక్రాంతికి రిలీజై, మంచి విజయం అందుకున్న 'మన శంకరవరప్రసాద్'లో చిరంజీవికి జోడీగా నయన్ అలరించారు. మరోవైపు, నయన్ నటించిన మలయాళ సినిమా తెలుగులోనూ ఏప్రిల్ 23న విడుదల కానుంది. 'బృందావనం', 'ఎవడు', 'మహర్షి' చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడే వంశీ పైడిపల్లి. కోలీవుడ్ హీరో విజయ్‌తో ఆయన తెరకెక్కించిన 'వారిసు' 2023 సంక్రాంతికి విడుదలై, సందడి చేసింది. కొంత విరామం అనంతరం సల్మాన్‌తో సినిమా చేస్తున్నారు. ఏప్రిల్‌లో షూటింగ్ ప్రారంభం కానుంది.

## రాముడి పాత్ర నా అదృష్టం..: రణ్‌బీర్ కపూర్

నితీశ్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ' ఈ సినిమా గ్లింప్స్‌ను ఏప్రిల్ 2న విడుదల చేయనున్నారు. తాజాగా ఈ గ్లింప్స్‌ను లాస్ ఏంజెలెస్‌లోని ఐమాక్స్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా రణ్‌బీర్ మాట్లాడుతూ శ్రీరాముడి పాత్రపై తనకున్న గౌరవాన్ని పంచుకున్నారు. "శ్రీరాముడు కేవలం ఒక పురాణ పాత్ర మాత్రమే కాదు. ఆయన శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది ప్రజల అంతరాత్మ. ఆరాధ్య దైవం. కష్ట సమయాల్లో మానవస్ఫూర్తి ఎలా ఉండాలో ఆయన మనకు నేర్పించారు. కరుణ, ధైర్యం, నీతి, క్షమాగుణానికి ఆయన నిలువుటద్దం. అందుకే ఆయన్ని 'మర్యాద పురుషోత్తముడు' అని పిలుస్తారు. అలాంటి పాత్ర నేను పోషించడం నా అదృష్టంగా భావిస్తున్నా" అని రణ్‌బీర్ చెప్పారు. ఏప్రిల్ 2న విడుదల కానున్న 'రామాయణ' గ్లింప్స్ 2 నిమిషాల 38 సెకన్లు ఉండనుంది.



# ఖాకీ సేవలకు 'గౌరవ' వందనం!

* ఏడుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ
* శాలువాలతో సన్మానించిన మల్కాజిగిరి సీపీ అవినాష్ మహంతి
* హెల్త్ పట్ల కేర్ తీసుకోవాలని రిటైర్డ్ సిబ్బందికి సూచన

మల్కాజిగిరి, మార్చి 31 (భారత శక్తి) : పోలీసు వృత్తిలో సవాళ్లను ఎదుర్కొంటూ దశాబ్దాల పాటు క్రమశిక్షణతో సేవలు అందించిన అధికారులకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఘనంగా వీడ్కోలు పలికింది. విధి నిర్వహణలో నిబద్ధత చాటుకున్న ఏడుగురు అధికారులను సీపీ అవినాష్ మహంతి మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

**నిరంతర పోరాటమే పోలీస్ జాబ్**

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం అంటేనే ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లతో కూడుకున్నదని కొనియాడారు. ఎంతో కాలం పాటు శాఖలో సమర్థవంతంగా పనిచేసి పదవీ విరమణ పొందడం సంతోషకరమని పేర్కొన్నారు. రిటైర్మెంట్ తర్వాత విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, కుటుంబ సభ్యులతో సమయాన్ని కేటాయించాలని సూచించారు.

**ఆరోగ్యంపై ఫోకస్ పెట్టండి..**

రిటైర్డ్ అధికారులు తమ ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ తో పాటు ఇతర ఆర్థిక అంశాల విషయంలో క్రమశిక్షణతో ఉండాలని సీపీ హితవు పలికారు. వీరికి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ త్వరగా అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆయన అక్కడికక్కడే ఆదేశించారు.


**వీడ్కోలు పొందిన వారు వీరే..**

కె. కరుణాకర్ రెడ్డి (సబ్ ఇన్స్పెక్టర్, ఘట్కేసర్)
పి. సత్యనారాయణ చారి (రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్)
ఎన్. జైరాం (ఏఎస్సై)
వై. సాయిబాబా (ఏఎస్సై)
ఏ. మూర్తుజా (ఏఎస్సై)
కె. పద్మా రావు (హోమ్ గార్డ్ ఆఫీసర్)
బి. బాలనర్సమ్మ (హోమ్ గార్డ్ ఆఫీసర్)

ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) ఇందిర, సీఏఓ శ్రీనివాస్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రా రెడ్డి, కోఆపరేటివ్ డైరెక్టర్ సువర్ణ, వల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మూడోసారి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా
# అంబటి బాలేష్ గౌడ్ నియామకం





సిద్దిపేట, మార్చి31 (భారత శక్తి) : బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా దుబ్బాక కు చెందిన అంబటి బాలేష్ గౌడ్ ను మరోసారి నియమిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఉత్తర్వులు జారీ చేశారు.బాలేష్ గౌడ్ ను రాష్ట్ర పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించడం ఇది మూడోసారి. గతంలో బండి సంజయ్ , తర్వాత కిషన్ రెడ్డి రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న సమయంలో కూడా రెండు సార్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పని చేసారు. ప్రస్తుత బిజెపి రాష్ట్రఅధ్యక్షులు రామ్ చందర్ రావ్ కూడా మరోసారి కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

* **ఆర్ఎస్ఎస్ నుండి ఏబీవీపీ లో చురుగ్గా....**

చిన్నప్పటి నుండి ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ లలో చురుకుగా పనిచేసిన బాలేష్ గౌడ్ పార్టీ లో అంచెలంచలుగా ఎదుగుతూ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు స్థాయికి చేరుకున్నారు. 2000 సంవత్సరంలో బిజెపి దుబ్బాక పట్టణ అధ్యక్షులుగా పార్టీలో తన ప్రస్థానాన్ని ప్రారంభించి మండల బీజేవైఎం అధ్యక్షులు గా, బిజెపి దుబ్బాక నియోజకవర్గ ప్రచార కార్యదర్శి గా, బిజెపి దుబ్బాక అసెంబ్లీ కన్వీనర్ గా రెండు సార్లు పని చేశారు. తర్వాత బిజెపి ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండు సార్లు, తర్వాత జిల్లాల విభజన అనంతరం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గా పని చేశారు. అనంతరం రెండుసార్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా పని చేసిన బాలేష్ గౌడ్ ను మళ్ళీ మూడోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

* **26 ఏళ్లుగా పార్టీలో బాధ్యతలు...**

గత 26 సంవత్సరాల నుండి పార్టీలో భాద్యతలు లేకుండా ఏనాడూ కూడా లేరు. బాలేష్ గౌడ్ ను రాష్ట్ర పార్టీ గతంలో హుజురాబాద్, మునుగోడు ఉప ఎన్నికలకు ఇంచార్జిగా నెలల రోజుల పాటు పంపించింది. తర్వాత నారాయణ ఖేడ్ నియోజకవర్గానికి కూడా పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం కూడా పని చేశారు. గత సంవత్సరం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలకు వేములవాడ నియోజకవర్గానికి ఇంచార్జి గా పని చేసారు. పార్టీ అప్పగించిన పనిని శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తారని స్వంత పార్టీలోనే బాలేష్ గౌడ్ కు మంచి పేరుంది.

**శక్తి వంచనలేకుండా కృషి చేస్తా**

* మూడోసారి నియమించడం సంతోషకరం
* పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు

* రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్ తనపై నమ్మకంతో మూడోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావ్ నియమించడం పట్ల అంబటి బాలేష్ గౌడ్ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడతానని తెలిపారు.రాబోయే 2028 ఎన్నికలలో తెలంగాణా రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని అన్నారు. తనని నియమించిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావ్ కి ఈ సందర్భంగా తాను ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

# ఏఎస్ ఐ శంకర్రావు, చాడ శ్రీనివాస్ సేవలు అభినందనీయం

* పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘన వీడ్కోలు
* పోలీస్ విభాగానికి అందించిన సేవలను ఎప్పటికీ మరవలేం
* పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపిఎస్



సిద్దిపేట, మార్చి 31(భారత శక్తి) : పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేసిన ఏఎస్ ఐ శంకర్రావు, చాడ శ్రీనివాస్ సేవలు అభినందనీయమని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపిఎస్ అన్నారు. మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.సుదీర్ఘకాలంగా పోలీస్ శాఖలో సేవలందిస్తూ పదవీ విరమణ పొందిన వారిలో సింగీతం శంకర్ రావు , అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ASI), బెజ్జంకి పోలీస్ స్టేషన్ - కానిస్టేబుల్గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి, హెడ్ కానిస్టేబుల్, అనంతరం ఏఎస్ఐగా అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ సేవలందించారు.చాడ శ్రీనివాస్ సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ - కానిస్టేబుల్గా ప్రారంభించి హెడ్ కానిస్టేబుల్ స్థాయికి ఎదిగి విధులు నిర్వర్తించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపిఎస్ పదవీ విరమణ పొందిన అధికారులను అభినందించి, సన్మాన పత్రం, మెమెంటో అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందిన వీరి సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. సిద్దిపేట పోలీస్ విభాగానికి వారు అందించిన సేవలను ఎప్పటికీ మరవలేమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా పోలీస్ కుటుంబ సభ్యులుగానే కొనసాగుతారని, ఎలాంటి సమస్య వచ్చినా తమను సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్ & లా అండ్ ఆర్డర్) కుశాల్కర్ , రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు నెలకు రూ.3వేలు..
# అస్సాంలో భాజపా మ్యానిఫెస్టో విడుదల

అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. భాజపా మంగళవారం మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) తో పాటు మహిళలకు నెలకు రూ.3వేలు అందిస్తామంటూ పలు హామీలు ప్రకటించింది. మొత్తం 31 హామీలతో కూడిన మ్యానిఫెస్టోను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు నేతలు విడుదల చేశారు. కాగా.. 126 అసెంబ్లీ స్థానాలు ఉన్న అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

**మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు..**

* రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్, ఎస్టీ ప్రాంతాలు మినహా.. అస్సాం అంతటా యూసీసీ అమలు
* వరదరహిత రాష్ట్రంగా చర్యలు
* బంగ్లాదేశీ మియాలు ఆక్రమించుకున్న భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం
* అరుణోదయ పథకం కింద మహిళలకు నెలకు రూ.3వేలు




అందజేత
* ఐదేళ్లలో 2 లక్షల మందికి ఉద్యోగాల కల్పన
* లఖ్‌పతి దీదీ పథకం కింద 40లక్షల మంది మహిళలకు ప్రోత్సాహకాలు




## బీజేపీలో చేరిన
# టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్

భారత టెన్నిస్ దిగ్గజం, ఒలింపిక్ పతక విజేత లియాండర్ పేస్ తన రాజకీయ ప్రయాణంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. పశ్చిమ బెంగాల్‌లో 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కీలక తరుణంలో పేస్ బీజేపీలో చేరాడు. గతంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో ఉన్న పేస్, ఇప్పుడు బీజేపీ తీర్థం పుచ్చుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, పశ్చిమ బెంగాల్ బీజేపీ మాజీ అధ్యక్షుడు, కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ సమక్షంలో లీండర్ పేస్ కాషాయ కండువా కప్పుకున్నాడు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. 1996 ఒలింపిక్స్‌లో పేస్ కాంస్య పతకం సాధించిన చారిత్రక క్షణాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో గాయంతో ఆడుతూ ఆండ్రీ అగస్సీ చేతిలో ఓడిపోయినప్పుడు తానెంతో బాధపడ్డానని చెప్పారు. ఒలింపిక్ పటంలో భారత్‌కు గుర్తింపు తెచ్చిన పేస్, ఇప్పుడు బీజేపీ వేదికగా దేశానికి సేవ చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన అనంతరం లియాండర్ పేస్ భావోద్వేగానికి గురయ్యాడు. "గడిచిన 40 ఏళ్లుగా క్రీడాకారుడిగా దేశం తరపున ఆడాను. డేవిస్ కప్, ఒలింపిక్స్ వంటి ఎన్నో టోర్నీలలో దేశానికి ప్రాతినిధ్యం వహించి గౌరవం తెచ్చాను. ఇప్పుడు నా సోదరులు అప్పగించిన బాధ్యతతో ఒక కొత్త రంగంలోకి అడుగుపెడుతున్నాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా నాయకత్వంలో దేశానికి, ముఖ్యంగా యువతకు సేవ చేయాలనుకుంటున్నాను" అని తెలిపాడు. ఈ అవకాశం కల్పించినందుకు పార్టీ అగ్రనాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశాడు. లియాండర్ పేస్ 2021లో మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీలో చేరినప్పటికీ, ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా బీజేపీలో చేరడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. బెంగాల్‌లో టీఎంసీకి గట్టి పోటీ ఇవ్వాలని భావిస్తున్న బీజేపీకి, పేస్ వంటి ప్రముఖుడి చేరిక కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో పేస్ పోటీ చేసే అవకాశం ఉందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి.

# యుద్ధాన్ని వాడుకొని లాభాల కోసం.. పీట్ హెగ్సెత్‌పై అనుమానాలు..?

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతోన్న వేళ అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ కు సంబంధించి ఓ సంచలన వార్త వినిపిస్తోంది. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ సైనిక చర్య ప్రారంభానికి కొన్నివారాల ముందు హెగ్సెత్ బ్రోకర్ ఒకరు అమెరికా రక్షణ రంగానికి సంబంధించిన కంపెనీల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెలువరించింది. మార్గాన్ స్టాన్లీతో కలిసి పనిచేస్తోన్న ఆ బ్రోకర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్లాక్‌రాక్‌ను సంప్రదించినట్లు సమాచారం. బ్లాక్‌రాక్‌కు చెందిన డిఫెన్స్ ఇండస్ట్రియల్స్ యాక్టివ్ ఈటీఎఫ్‌లో మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే అవకాశాల గురించి ఆ బ్రోకర్ ఆరా తీసినట్లు సదరు కథనం వెల్లడించింది. దీనికి సంబంధించి అంతర్గతంగా చర్చలు నడిచాయని సదరు వర్గాలు పేర్కొన్నట్లు



తెలిపింది. కానీ, ఆ ఈటీఎఫ్‌లను మార్గాన్ స్టాన్లీ ద్వారా కొనుగోలు చేసేందుకు అప్పట్లో అవి అందుబాటులో లేకపోవడంతో ఆ పెట్టుబడుల ప్రక్రియ ముందుకువెళ్లలేదని సమాచారం. ఆ తర్వాత పీట్ హెగ్సెత్ బ్రోకర్ మరో రక్షణరంగ కంపెనీలో పెట్టుబడులు పెట్టారా? లేదా? అనేదానిపై స్పష్టత లేదు. అయితే, యుద్ధానికి కొన్ని వారాల ముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడంతో పీట్ హెగ్సెత్ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీట్ చెప్పడం వల్లే పశ్చిమాసియాలో యుద్ధానికి దిగానంటూ అమెరికా అధ్యక్షుడు ఇటీవల వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ఈ పెట్టుబడుల వార్తల గురించి రక్షణ మంత్రి నుంచి గానీ.. పెంటగాన్ నుంచి గానీ ఎలాంటి స్పందన వెలువడలేదు. బ్లాక్‌రాక్‌కు చెందిన డిఫెన్స్ ఇండస్ట్రియల్స్ యాక్టివ్ ఈక్విటీ ఫండ్ విలువ 3.2 బిలియన్ డాలర్లు. రక్షణ, భద్రతపై ప్రభుత్వం ఖర్చు పెరగడం వల్ల లాభపడే ఏరోస్పేస్, సెక్యూరిటీ టెక్నాలజీ, డిఫెన్స్ కాంట్రాక్టింగ్ వంటి కంపెనీల స్టాక్ పోర్ట్‌ఫోలియోను ఇది నిర్వహిస్తుంది. ఆర్టీఎక్స్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రధాన రక్షణ రంగ కంపెనీలు దీనితో కలిసి పనిచేస్తున్నాయి. తక్కువ ఫీజులు, పన్ను ప్రయోజనాలు వంటి కారణాలతో ఇలాంటి ఈటీఎఫ్‌లకు మదుపర్ల నుంచి మంచి స్పందన లభిస్తుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

# కేరళలో లెఫ్ట్ కూటమి గెలుపొందాలని మోదీ కోరుకుంటున్నారు

**: రాహుల్ గాంధీ**


కేరళలో లెఫ్ట్ కూటమి గెలుపొందాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సీపీఐ(ఎం) వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్ వింగ్ పార్టీ అని విమర్శించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా లెఫ్ట్ పార్టీ నేతలు బీజేపీతో జతకట్టారని అన్నారు. అందుకే కేరళలో ఎల్డీఎఫ్ గెలుపొందాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. కన్నూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రతిచోట మతం, దేవుడి గురించి మాట్లాడుతారని, కానీ కేరళలో మాత్రం కనీసం




శబరిమల బంగారం చోరీపై కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు. బంగారు తాపడాలు మాయం కావడం వెనుక సీపీఐ నేతల హస్తం ఉందని ఆరోపించారు. సీపీఐతో జతకట్టడం వల్లే బీజేపీ నాయకులు శబరిమల అంశంపై మాట్లాడటం లేదని అన్నారు. బీజేపీతో జతకట్టడం సీపీఐలోని కొంతమంది నాయకులకు ఇష్టం లేదని, అందుకే వారు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. శబరిమల ఆలయంలో బంగారం చోరీకి సంబంధించి సీపీఐ(ఎం) నాయకులపై బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, ఇక్కడి ఎల్డీఎఫ్ మధ్య ఒక అవగాహన ఉందని ఆరోపించారు. కేరళ ముఖ్యమంత్రిని నరేంద్రమోదీ నియంత్రిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేరళ ముఖ్యమంత్రిని జైల్లో పెట్టగలిగే తాళం చెవి మోదీ వద్ద ఉందని, కానీ ఆయన చర్యలు మాత్రం తీసుకోరని అన్నారు.

# పది పరీక్షల్లో యథేచ్ఛగా మాస్ కాపీయింగ్.!

* సెల్ ఫోన్లు లోపలకి తీసుకెళ్తున్న ఇన్విజిలేటర్లు
* మారుమూల ప్రాంతంలో తనిఖీలు శూన్యం
* నిఘా నీడలో పది పరీక్షలు జరుగుతున్నట్లు చాటింపు
* గంటలోపే బయటకు వస్తున్న క్వశ్చన్ పేపర్
* వెంటనే లోపలికి వెళ్తున్న ప్రశ్నలకు సమాధానాలు
* సహకరిస్తున్న ఇన్విజిలేటర్లు
* ఉన్నతాధికారులకు, స్క్వాడ్ కు సవాల్ విసురుతున్న ప్రైవేట్ యాజమాన్యాలు






మణుగూరు/పినపాక, మార్చి 31 (భారతశక్తి): విద్యార్థులలో ప్రతిభను వెలికితీసి ఉన్నత చదువుల కోసం నైపుణ్యతను పెంపొందించేందుకు క్రింద స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తారు. కానీ అందుకు విరుద్ధంగా పినపాక మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ యథేచ్ఛగా జరుగుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇన్విజిలేటర్లు ప్రైవేట్ విద్యార్థులకు ఒక తీరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మరో తీరు వ్యవహరిస్తున్న తీరు పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదవ తరగతి పరీక్షలలో సామూహిక కాపీయింగ్ ను అనుమతించడం అంటే విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమే. చాలా మంది ఇన్విజిలేటర్లు స్వయంగా మాస్ కాపీయింగ్ కు సహకరిస్తుండటం దారుణమైన ఘటన. గతంలో జరిగిన పరిణామాలను దృష్టిలో పెట్టుకొని పినపాక నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలను కఠినంగా నిర్వహిస్తున్నామని జిల్లా ఉన్నతాధికారులు మీడియా ముందు డమరుకం మ్రోగిస్తున్నారు. అయిన స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తూతూ మంత్రంగా పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేస్తూ సంతకాలకే పరిమితమవుతున్నారు.

*** పరీక్ష కేంద్రాల్లో స్క్వాడ్ తనిఖీలు శూన్యం***

జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి పది పరీక్షలలో మాస్ కాపీయింగ్, సెల్ ఫోన్లు తీసుకెళ్లినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు, స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ కు ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలను తుంగలోతొక్కి ప్రతి పరీక్ష ప్రశ్న పత్రం నైపుణ్యం గల ఉపాధ్యాయులకు పంపించి సమాధానాలతో లోపలికి పంపిస్తున్నారు. ఇన్విజిలేటర్ల అనుమతి లేకుండా క్వశ్చన్ పేపర్లు బయటికి ఎలా వస్తున్నాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంటీరియర్ ప్రాంతం కావడంతో, స్క్వాడ్ తనిఖీలు లేకపోవడం ఇన్విజిలేటర్లు ఇష్టారాజ్యంగా సెల్ ఫోన్లో క్వశ్చన్ పేపర్లు చిత్రీకరించి సంబంధించిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలకు పంపించి సమాధానాలు తయారుచేసి విద్యార్థులకు చేరవేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

*** సవాల్ విసురుతున్న ఇన్విజిలేటర్లు**

విద్యార్థుల నైపుణ్యతను పెంచి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి పరీక్షకు మూడు, నాలుగు రోజుల సమయం వెచ్చించింది. అయితే ఆ సమయాన్ని సైతం కొంతమంది ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఇచ్చే ముడుపులకు ఇన్విజిలేటర్ల కక్కుర్తితో నిబంధనలు బేఖాతర్ చేస్తూ మాస్ కాపీయింగ్ కు పాల్పడి విద్యార్థుల భవితవ్యం, నైపుణ్యతను దెబ్బతిస్తున్నారు. అంతే కాకుండా పినపాక, మణుగూరు మండలల్లోని పరీక్ష కేంద్రాల్లో స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఉన్నతాధికారులకు మమల్ని పట్టుకోలేరని ఇన్విజిలేటర్లు సవాళ్లు విసురుతున్నారు.

*** బైకి బై స్కోర్ కోసం పాకులాట***

ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బైకి బై స్కోర్ తెచ్చుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. బైకి బై రాక పోతే స్కూల్ ప్రతిష్ట దెబ్బతిని వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు తగ్గుతాయనే ఆలోచనలతో అన్ని రకాలుగా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కొక్క పరీక్షకు మూడు రోజుల గ్యాప్ రావడం, మండలంలోనే స్కూల్ ప్రథమ స్థానంలో సత్తా చాటేందుకు శతవిధాలుగా రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికి సెంటర్లోకి వెళ్లి ప్రశ్నపత్రం చూసి ఫోటోలు తీసుకుని బయటకు వచ్చి సమాధానాలతో పరీక్ష కేంద్రంలోకి వెళ్లి ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ఒకరకంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో రకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్ అనుమతి లేకున్నా సెల్ ఫోన్లు అనుమతిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదంతా జరుగుతున్న సంబంధిత నిఘా వ్యవస్థ చూసిచూడనట్లుగా వ్యవహరిస్తుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో కొందరు అధికారులు బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

*** స్క్వాడ్ దృష్టి సారించాలి**

ఏజెన్సీ ప్రాంతాలైన మణుగూరు, పినపాక మండలాల్లో పది పరీక్షలు జరిగే కేంద్రాలపై స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ నిత్యం తనిఖీలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఏది ఏమైనా ప్రైవేట్ పాఠశాలలు ర్యాంకుల కోసమే అడ్డదారులు తొక్కేందుకు తపనపడుతున్నట్లు విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక పదో తరగతి పరీక్ష కేంద్రంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మాస్ కాపీయింగ్ పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. ఈతరహా సంఘటనలు విద్యావ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని, నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, విశ్లేషకులు భావిస్తున్నారు.



**బీడీలు తెచ్చుకోవడానికి వెళ్లి వయసు రీత్యా దారి మర్చిపోయి తప్పిపోయిన 85 ఏండ్ల ముదుసలి తండ్రి కొత్త ఇస్తారి. సాయి స్నేహ ఎమరాల్డ్ అపార్ట్మెంట్ పి అండ్ టీ కాలనీ నివాసి అయిన గుండ్యాల లీలావతి తన తండ్రి కొత్త ఇస్తారి 10 రోజుల క్రితమే ఊరి నుండి వచ్చాడని,ఎవరికీ చెప్పకుండా బీడీలు కొనడానికి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని, వయసు రీత్యా దారి తప్పి పోవచ్చని ఆవేదనతో సరూర్నగర్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.**

**ఎల్బీనగర్, మార్చి 31(భారత శక్తి):**

# రిజర్వేషన్ విధానాన్ని ఎత్తివేయాలి



* ప్రతిభకు పట్టం కట్టాలి తప్ప కులం పేరుతో రిజర్వేషన్లు ఉండొద్దు
* బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య క్రమశిక్షణ కమిటీ చైర్మన్, వక్కలంక శ్రీనివాసరావు

ఎల్బీనగర్, మార్చి 31(భారత శక్తి): రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేయాలని కింద జాతి పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లను ప్రభుత్వం తొలగించాలని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వక్క లంక శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల ఎంఆర్పిఎస్ ప్రముఖ నాయకులు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, బ్రాహ్మణులు దేవాలయాల్లో పూజలు చేయవద్దని ఒక సమావేశంలో మాట్లాడడం, అది బ్రాహ్మణులను కించపరచడమేనని, సమాజం, నాగరికత నేర్చుకోక ముందు నుండే బ్రాహ్మణుడి మాటను సమాజం గౌరవించిందని,ఆయన చెప్పిన మంచి రోజునే శుభకార్యాలను చేసుకుంటున్న సమాజం మనదని, అలాంటి సమాజంలో జీవిస్తున్న మందకృష్ణ మాదిగ బ్రాహ్మణులను కించపరుస్తూ, సర్వేజనా సుఖినోభవంతు అంటూ, తమ వృత్తి తాము చేసుకుంటున్న బ్రాహ్మణులు ఆ వృత్తిలో కొనసాగరాదని అనడం తగదని, అందుకే మాకు కడుపు మండి, రక్తం ఉడికి రిజర్వేషన్లు ఎత్తివేయాలనే వ్యాఖ్యలు చేయవలసి వచ్చిందని, తక్షణమే మంద కృష్ణ మాదిగ తన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోవాలని, యావత్ బ్రాహ్మణ సమాజానికి క్షమాపణ చెప్పి సమాజంలో తిరగాలని లేకపోతే బ్రాహ్మణ జాతి అతనికి తగిన బుద్ధి చెబుతుందని, హెచ్చరించారు.కులాలను అడ్డుపెట్టుకొని రిజర్వేషన్లు అనుభవిస్తూ సనాతన ధర్మాన్ని కాపాడుతున్న బ్రాహ్మణ కులాలను కించపరచినట్లు మాట్లాడడం క్షమించరాని నేరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంద కృష్ణ మాదిగ నువ్వు పుట్టినప్పుడు నీ జన్మ దినోత్సవాన్ని ఏరోజు చేయాలని,నీ పెళ్లి ఏ తేదీలో జరపాలని ముహూర్తం చూసి చెప్పినవాడు బ్రాహ్మణుడు కాదా, ఒక్కసారి ఆలోచించుకోవాలని, ఇలాంటి బుద్ధి తక్కువ మాటలు మాట్లాడితే సమాజం నీకు గుణపాఠం చెబుతుందని, ప్రజా సేవలో ఉన్న నీవు ప్రజలలో భాగంగా ఉన్న బ్రాహ్మణుల గురించి మాట్లాడడం,నీ మూర్ఖత్వానికి పరాకాష్ట అని ఎద్దేవా చేశారు. ఇకనైనా మందకృష్ణ మాదిగ యావత్ బ్రాహ్మణ జాతికి క్షమాపణ చెప్పే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని తమ ఈ పోరాటాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చేస్తామని హెచ్చరించారు.



## భైంసా బస్ స్టేషన్‌లో ఎంహెచ్ఎల్ పథకం
# కృతజ్ఞతా సమావేశం ఘనంగా నిర్వహణ




నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చి 31 (భారత శక్తి): భైంసా బస్ స్టేషన్‌లో ఎంహెచ్ఎల్ (MHL) పథకం ఆధ్వర్యంలో కృతజ్ఞతా సమావేశం ఎంతో వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీ టి. సాయి కుమార్ గారు మరియు ఎస్‌డబ్ల్యూఆర్ఈఎస్ (SWRES) వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రసన్న గారు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని విశిష్టంగా అలంకరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ప్రజల సహకారం లేకుండా ఏ పథకం విజయవంతం కావడం సాధ్యం కాదని తెలిపారు. ఎంహెచ్ఎల్ పథకం ద్వారా ప్రయాణికుల భద్రత, సౌకర్యాల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు. ముఖ్యంగా బస్ స్టేషన్‌లో సేవలు అందిస్తున్న సిబ్బంది మరియు ప్రజల సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా గౌరవనీయ ప్రయాణికులను సన్మానించారు. ఉపాధ్యాయులు, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు వంటి వివిధ వర్గాలకు చెందిన ప్రయాణికులను బహుమతులు మరియు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సన్మానం అందుకున్న వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పథకం పట్ల అవగాహన పెంచడంతో పాటు, ప్రయాణికుల సేవల ప్రాధాన్యతను చాటి చెప్పడం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమం స్థానికంగా మంచి స్పందనను పొందింది.

# సామాజిక విప్లవమూర్తుల స్మృతివనం.. ఆవిష్కరణకు ముస్తాబు!

* ఏప్రిల్ 11న పూలే దంపతుల విగ్రహాల ప్రారంభోత్సవం లేక్ వ్యూ పార్కులో పనులను పరిశీలించిన మంత్రులు పొన్నం, కొండా సురేఖ.



హైదరాబాద్ మార్చి 31 భారత శక్తి: భారత సామాజిక ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత సంస్కర్తలు, మహాత్మా జ్యోతిరావు పూలే మరియు సావిత్రిబాయి పూలేల స్మృతిని చాటిచెప్పేలా నగరం నడిబొడ్డున ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు సిద్ధమైంది. పీవీఎన్ఆర్ మార్గ్‌లోని లేక్ వ్యూ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన వీరి విగ్రహాలను వచ్చే నెల 11న, పూలే జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు.

**అణగారిన వర్గాల ఆశాదీపాలు..**

విగ్రహాల పరిశీలన అనంతరం మంత్రులు మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే దంపతులు వేసిన బాట నేటికీ ఆదర్శనీయమని కొనియాడారు. అక్షర యోధులు: సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన జ్యోతిరావు పూలే ఆశయాలను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మహిళా చైతన్యం: అడ్డంకులను అధిగమించి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే చేసిన సేవలు అజరామరమని పేర్కొన్నారు.

*** 16 అడుగుల రాజసం.. 2,517 గజాల ప్రాంగణం.**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది.

* విగ్రహాల వైభవం: దాదాపు 16 అడుగుల ఎత్తుతో రూపొందిన ఈ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.
* సుందరీకరణ: సుమారు 2,517 చదరపు గజాల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన ల్యాండ్‌స్కేపింగ్, ఫుట్‌పాత్‌లు, కూర్చునేందుకు వీలుగా బెంచీలను ఏర్పాటు చేశారు.
* పనుల పురోగతి: విగ్రహాల పీఠం, రక్షణ గోడలు మరియు రైలింగ్ పనులు పూర్తయ్యాయి. విద్యుదీకరణ, ఇతర తుది మెరుగులు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులు మంత్రులకు వివరించారు.



**అధికారుల సమక్షంలో సమీక్ష**

ఈ తనిఖీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అధికారుల తరపున జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ డి. హరిచందన, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు పనుల సాంకేతిక వివరాలను మంత్రులకు వివరించారు.

# క్వాంటం అప్లికేషన్లతో ఆంధ్రప్రదేశ్ కే తొలి ప్రయోజనాలు

అమరావతి, మార్చి 31 (భారతశక్తి) : క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్ల ద్వారా లభించే ప్రయోజనాలను దేశంలోనే తొలిగా అందుకునేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తు సాంకేతికత అయిన క్వాంటం కంప్యూటింగ్‌లో 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడం ద్వారా రాష్ట్రానికి అపార అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో 'అమరావతి క్వాంటం వ్యాలీ క్వాంటం హార్డ్ వేర్ మాన్యుఫాక్చరింగ్ ఎకోసిస్టమ్' అనే అంశంపై జరిగిన ఉన్నత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్న అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ), దేశానికే ప్రగతి ప్రేరకంగా నిలుస్తుందని అన్నారు. ఈ కీలక సమావేశానికి నేషనల్ క్వాంటం మిషన్ డైరెక్టర్ జేబీవీ రెడ్డి, స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్, ఐబీఎం డైరెక్టర్ అమిత్ సింఘీతో పాటు సీడాక్, సీడాట్, డీఆర్‌డీవో, బార్క్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. మూడు దశాబ్దాల క్రితం ఐటీని అందిపుచ్చుకుని హైదరాబాద్‌ను నాలెడ్జ్ ఎకానమీగా మార్చిన స్ఫూర్తితో, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీని ఏపీ అభివృద్ధికి చోదకశక్తిగా మలుస్తామని చంద్రబాబు వివరించారు. గతంలో ఐటీ నిపుణుల కోసం ఇంజనీరింగ్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసినట్లే, ఇప్పుడు క్వాంటం నిపుణులను తీర్చిదిద్దేందుకు వైసర్, ఐబీఎం వంటి సంస్థల భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. 'మేడ్ ఇన్ అమరావతి' క్వాంటం హార్డ్ వేర్ లక్ష్యం రాబోయే రెండేళ్లలో 'మేడ్ ఇన్ అమరావతి' బ్రాండ్‌తో క్వాంటం కంప్యూటింగ్ పరికరాలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. క్వాంటం హార్డ్ వేర్, క్రయోజనిక్స్, అల్గారిథమ్స్ వంటివాటిని దిగుమతి చేసుకోకుండా, అమరావతి క్వాంటం వ్యాలీలోనే దేశీయంగా ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. 2030 నాటికి ప్రపంచంలోని 5 గ్లోబల్ క్వాంటం హబ్స్‌లో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దాలని, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, హార్డ్ వేర్ ఎకోసిస్టంను ఏక్యూవీలో ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న 8 టవర్లలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌తో పాటు స్టార్టప్‌లు, పరిశోధనలకు అవకాశం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రణాళికలో భాగంగా, దేశంలోనే తొలి ఓపెన్ క్వాంటం కంప్యూటర్‌ను ఏప్రిల్ 14వ తేదీన అమరావతిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు క్యూబిట్ ఫోర్స్ సంస్థ డైరెక్టర్ వెంకట్ సుబ్రమణ్యన్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్ ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు టెస్టింగ్ కోసం ఈ కంప్యూటర్ అందుబాటులో ఉంటుందని వారు వివరించారు. క్వాంటం టెక్నాలజీతో అమరావతి భవిష్యత్ నగరంగా, అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా మారుతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బృహత్తర లక్ష్యసాధనకు అవసరమైన సాంకేతికత, భాగస్వామ్యం అందించాలని జాతీయ క్వాంటం మిషన్‌ను ఆయన కోరారు.

## స్పెయిన్ బాటలోనే...
# అమెరికాకు షాకిచ్చిన ఇటలీ

ఇటలీ : తమ వైమానిక స్థావరాల్లో అమెరికా సైనిక విమానాలు దిగడానికి ఇటలీ అనుమతి నిరాకరించింది. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఇప్పటికే స్పెయిన్ అమెరికాకు షాకిచ్చింది. యుద్ధంలో పాలుపంచుకునే విమానాలను తమ గగనతలంలోకి అనుమతించబోమని స్పెయిన్ ప్రకటించింది. తాజాగా, ఇటలీ కూడా అదే దారిలో నడుస్తోంది. అమెరికాకు తమ గగనతలాన్ని మూసివేయాలని ఇటలీ చర్యలు తీసుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. సిసిలీలోని సిగోనెల్లా వైమానిక స్థావరాన్ని అమెరికా యుద్ధ విమానాలు ఉపయోగించుకోవడానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు ఇటలీ ప్రకటించింది. పశ్చిమాసియాకు వెళ్లే ముందు సిసిలీలోని వైమానిక స్థావరంలో తమ బాంబర్ విమానాలను నిలపడానికి అమెరికా ఇటలీ అనుమతి కోరినట్లు కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇటలీ అనుమతి నిరాకరిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

# వారసత్వమే శాంతికి వారధి ప్రధాని మోదీ

ఢిల్లీ, మార్చి 31 (భారతశక్తి) : ప్రపంచం అస్థిరత్వంతో సతమతమవుతూ, అశాంతి జ్వాలలతో దహించుకుపోతున్న క్లిష్ట సమయంలో సాంస్కృతిక వారసత్వమే మానవాళికి మార్గం చూపుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇవాళ మహావీర్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లోని కోబా తీర్థ్‌లో ఏర్పాటు చేసిన 'సమ్రాట్ సంప్రతి మ్యూజియం'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మ్యూజియం ఇచ్చే సందేశం కేవలం భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికి అత్యంత కీలకమని అన్నారు. అశోక చక్రవర్తి మనవడు, అహింసా మార్గాన్ని ప్రచారం చేసిన సమ్రాట్ సంప్రతి పేరుతో ఈ మ్యూజియంను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా సేకరించిన జైన సమాజానికి చెందిన అమూల్యమైన కళాఖండాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. వీటిలో కొన్ని 1000 సంవత్సరాల కంటే పురాతనమైనవి కావడం విశేషం. దశాబ్దాల పాటు తమ జీవితాలను అంకితం చేసి, భారతదేశం, నేపాల్ నుంచి ఈ కళాఖండాలను సేకరించిన జైన సన్యాసి ఆచార్య పద్మసాగర్ సూరీశ్వర్జీ సేవలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ మ్యూజియం కేవలం కళాఖండాల భాండాగారం మాత్రమే కాదని, ఇది జైన ఆరాధనకు, సంస్కృతికి, వారసత్వ పరిరక్షణకు ఒక శక్తిమంతమైన కేంద్రమని ప్రధాని మోదీ అభివర్ణించారు. కోబా తీర్థ్ ఎంతో కాలంగా శాంతికి, ఆధ్యాత్మిక సాధనకు నెలవుగా ఉందని గుర్తుచేశారు. ఈ మ్యూజియం రూపకల్పనలో వేదాలు, పురాణాలు, ఆయుర్వేదం వంటి భారతీయ సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని, ఇది మన భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు ఈ కేంద్రాన్ని పెద్ద సంఖ్యలో సందర్శించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మ్యూజియంలో జైన తత్వశాస్త్రం, తీర్థంకరుల జీవితాలు, ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, ఆలయ నమూనాలు, చారిత్రక కళాఖండాలతో కూడిన ఏడు గ్యాలరీలు ఉన్నాయి. సంప్రదాయ ప్రదర్శనలతో పాటు ఆధునిక డిజిటల్, ఆడియో విజువల్ టెక్నాలజీని మేళవించి సందర్శకులకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నారు.

* **'వికాస్ భీ, విరాసత్ భీ'కి ఇది నిదర్శనమన్న గుజరాత్ ప్రభుత్వం**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఈ మ్యూజియం సాంస్కృతిక పరిరక్షణ కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ మాట్లాడుతూ.. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం రెండూ) అనే ప్రభుత్వ దార్శనికతకు ఈ మ్యూజియం నిదర్శనమని, ప్రధాని చేతుల మీదుగా ఇది ప్రారంభం కావడం జైన సమాజానికి గర్వకారణమని తెలిపారు.

## అమెరికా సాయం చేయదు..
# మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

అమెరికా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. "అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

# తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్, మార్చి 31 (భారతశక్తి) : తెలంగాణ రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

## సంగారెడ్డి లోని
# గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్ భరోసా కేంద్రాల తనిఖీ

- **ప్రతి ఒక్కరూ చట్టాల పైన అవగాహన కలిగి ఉండాలి.**
- **న్యాయమూర్తి బి.సౌజన్య, జిల్లా కార్యదర్శి న్యాయ సేవా అధికార సంస్థ సంగారెడ్డి**



సంగారెడ్డి జిల్లా, మార్చి 31 (భారత శక్తి న్యూస్): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల మేరకు సంగారెడ్డి లోని గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్, భరోసా కేంద్రం నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య తనికి నిర్వహించటం జరిగినది. అనంతరం న్యాయమూర్తి బి.సౌజన్య జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సంగారెడ్డి వీరు మాట్లాడుతూ భరోసా కేంద్రాన్ని సందర్శించే బాధితులకు తక్షణమే న్యాపరమైన సూచనలు సలహాలు అందించి వారికి పోక్సో చట్టం, మహిళ చట్టాలపై అవగాహన కల్పిస్తూ న్యాయ సహాయం కల్పించాలని అన్నారు, లైంగిక చర్యలు పాల్పడే నిద్యుత్తులపై చట్టరీత్యా కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఆశ్రమాలలో వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సంపూర్ణ సంరక్షణకు తోడ్పడాలని అన్నారు. అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా నిర్వాహకులు చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. భరోసా కేంద్రాన్ని సందర్శించే బాధితుల యొక్క సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎవరికైనా న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం పొందాలనుకునే వారికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సాయాన్ని అందిస్తామన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య తో పాటు భరోసా కేంద్రం అధికారులు ఓల్డ్ ఏజ్ హోమ్ అధికారులు తదితరులు ఉన్నారు.



# కాంగ్రెస్ మార్క్ అప్పుల పాలన

హైదరాబాద్, మార్చి 31 (భారతశక్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రోజువారీ ఖర్చులకు ఆర్బీఐ దగ్గర చేయి చాచాల్సిన దుస్థితిలోకి రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నెట్టేసిందన్నారు. కాగ్ 202425 నివేదికలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వెల్లడించిన అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారంలోకి రాకముందు "సంపద పెంచుతాం.. పేదలకు పంచుతాం" అని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ ఖర్చులకు కూడా కూడా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద చేయి చాచాల్సిన పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రెండు రోజులు మినహా మిగతా అన్ని రోజులు ఆర్బీఐ నుంచి చేబదులుగా డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని నెట్టుకురావడం సిగ్గుచేటని అన్నారు. ఏడాది కాలంలో రూ.1.30 లక్షల కోట్లు చేబదులు అప్పులు తెచ్చి సర్కారును నడిపించటమంటే కచ్చితంగా అది చేతకానితనమేనని విమర్శించారు. తెచ్చిన అప్పుల్లో మరో 6 వేల కోట్లు ఆర్థిక సంవత్సరం ముగిసినా చెల్లించలేదనే విషయాన్ని కాగ్ బట్టబయలు చేసిందన్నారు. నెలకు రూ. 12 వేల కోట్ల సొంత ఆదాయం ఉన్న తెలంగాణలో రోజువారీ కనీస అవసరాల కోసం రూ. 1.38 కోట్ల బ్యాలెన్స్ కూడా మెయింటెన్ చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు.

**సంపద పెంచటంలో విఫలం**

ఎన్నికలకు ముందు సంపద పెంచుతాం.. పేదలకు పంచుతామని కాంగ్రెస్ నాయకులు పెద్ద, పెద్ద మాటలు చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద పెంచటం మాట అటుంచితే కేవలం అప్పులతోనే కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఇప్పటికే అడ్డగోలుగా రూ. 8.65 లక్షల కోట్ల అప్పులు చేసి, రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై దాదాపు రూ. 9 లక్షల అప్పు భారాన్ని మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి ఆర్థిక సంక్షోభంలో కూడా ఇంకా "మిగులు బడ్జెట్" అని చెప్పుకుంటూ తెలంగాణ ప్రజలను పచ్చి దగా చేస్తున్నారంటూ మండిపడ్డారు. కాగ్ నివేదికతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక విధ్వంసం బట్ట బయలైందన్నారు. ఇకనైనా ప్రచార ఆర్భాటాలు బంద్ చేసి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

* **అకాల వర్షా లతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి**

అకాల వర్షాలు రైతులను ఆగం చేశాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల్లో అకాల వర్షాల కారణంగా చేతికొచ్చే దశలో ఉన్న పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. వందలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, మామిడి కాయలు నేలరాలాయని తెలిపారు. నువ్వులు, పసుపు, వరి పంటలకు తీరని నష్టం జరిగిందన్నారు. అకాల వర్షాల కారణంగా రైతుల కష్టం అంతా నేల పాలైందని విచారం వ్యక్తం చేశారు. సోమవారం అర్ధరాత్రి, మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# కొలంబియా బిజినెస్ స్కూల్‌లో కేటీఆర్ ప్రసంగం


హైదరాబాద్, మార్చి 31 (భారతశక్తి) : కొలంబియా యూనివర్సిటీలో జరగనున్న ఓ కీలక సదస్సులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రసంగించనున్నారు. ఈ మేరకు ఆయనకు జనవరి నెలలోనే ఆహ్వానం అందింది. ది న్యూ ఇండియా ప్లేబుక్..అనే పేరుతో ఏప్రిల్ 4న న్యూయార్క్‌లో జరగనున్న ఈ సదస్సులో భారతీయ వ్యాపారాలు, వ్యూహాలు, సుస్థిరతపై అనేక రంగాలకు చెందిన ప్రముఖులు ప్రసంగించనున్నారు. India's Rise: Rewriting the global business playbook అనే టాపిక్ పై వచ్చే శనివారం మధ్యాహ్నం 3 గంటల నుండి 4 వరకు మాట్లాడనున్నారు. కొలంబియా యూనివర్సిటీకి చెందిన విద్యార్థి విభాగం 'South Asia Business Association' (SABA) ఈ కార్యక్రమాన్ని గత 21 ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నది. ఈ ఏడాది నిర్వహిస్తున్న వ్యాపార రంగంలో లబ్ధప్రతిష్టులైన పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాలు పంచుకోనున్నారు.

**ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, నార్త్ వెస్టర్న్**

కాగా ఇప్పటి వరకు కేటీఆర్ పలు ప్రతిష్టాత్మక గ్లోబల్ యూనివర్సిటీల్లో, వేదికలపై వివిధ అంశాలపై లెక్చర్ ఇచ్చారు. 2025 ఏప్రిల్‌లో అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలో.. తెలంగాణ స్టార్టప్ విప్లవానికి కీలక పాత్ర పోషించిన టీ హబ్, వర్క్స్, వీ హబ్‌లపై చర్చించారు. అదే ఏడాది జూన్‌లో లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో "Governing Innovation - A Telangana Case Study." అనే అంశంపై... 2014 నుంచి తెలంగాణ సాధించిన అభివృద్ధిని వివరించారు. గత ఏడాది ఏప్రిల్‌లో లండన్‌లోని మేధాపరమైన వేదిక బ్రిడ్జ్ ఇండియా నుంచి projecting Telangana as a global case study in sustainable growth and innovation అనే టాపిక్‌లో తెలంగాణ అభివృద్ధి ఎలా సాధించగలిగిందో విశ్లేషించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో హార్వర్డ్ యూనివర్సిటీలో The India We Imagine అనే టాపిక్‌పై మాట్లాడారు.

# జిహెచ్ఎంసి పన్నుల వసూళ్ల సునామీ.. విభజన ధమాకా

హైదరాబాద్, మార్చ్ 31 (భారత శక్తి) : మహానగరం మరో చారిత్రక మలుపు తిరిగింది. ఒకప్పుడు ఏకచ్ఛత్రాధిపత్యంగా వెలిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధ్యాయం ముగిసి.. నేటి (ఏప్రిల్ 1) నుంచి మూడు కొత్త పాలనా విభాగాలుగా అవతరించింది. 202526 ఆర్థిక సంవత్సరం ముగింపు రోజున ఊహించని రీతిలో ₹2,500 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసి రికార్డు సృష్టించిన జీహెచ్ఎంసీ, తన వారసత్వాన్ని మూడు కొత్త కార్పొరేషన్లకు బదిలీ చేస్తూ విభజన ప్రక్రియను పూర్తి చేసింది.







### * మూడు ముక్కలాట కాదు.. అభివృద్ధి వేట!

పాలనా సౌలభ్యం పేరుతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేటి నుంచి కార్యరూపం దాల్చనుంది. కేవలం ఒకే కమిషనర్‌పై ఉన్న ఒత్తిడిని తగ్గించి, స్థానిక సమస్యలపై ఫోకస్ పెట్టేందుకు ఈ విభజన దోహదపడనుంది.

* GHMC (కోర్ సిటీ): పాత నగరం మరియు ప్రధాన నగర ప్రాంతాలపై దృష్టి.
* CMC (సైబరాబాద్): ఐటీ కారిడార్, పశ్చిమ హైదరాబాద్ అవసరాల కోసం.
* MMC (మల్కాజ్గిరి): వేగంగా విస్తరిస్తున్న ఉత్తర, తూర్పు శివారు ప్రాంతాల కోసం.
* "ఎవరి లెక్క పక్కాగా వారిదే" అనే సూత్రంతో ఇకపై ఆయా ప్రాంతాల నుంచి వచ్చే ఆదాయాన్ని అక్కడి అభివృద్ధి పనులకే ఖర్చు చేయనున్నారు. ఐటీ హబ్ నుంచి వచ్చే భారీ ఆదాయం ఇకపై నేరుగా సైబరాబాద్ కార్పొరేషన్ ఖజానాకే చేరనుంది.

### పన్నుల జాతర.. ఖజానా గలగల!

గడచిన ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీ అధికారులు పన్నుల వసూళ్లలో దూకుడు ప్రదర్శించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన్ టైమ్ సెటిల్మెంట్ (OTS) పథకం అద్భుత ఫలితాలను ఇచ్చింది. వడ్డీపై 90% రాయితీ ఇవ్వడంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలు వరదలా వచ్చి చేరాయి.

జోన్ల వారీగా వసూళ్ల అంచనా లెక్కలు:

* కార్పొరేషన్ | నిర్మాణాల సంఖ్య | వసూలైన పన్ను (కోట్లలో) |
* సైబరాబాద్ (CMC) | 9.43 లక్షలు | ₹916 కోట్లు |
* హైదరాబాద్ (GHMC) | 11.45 లక్షలు | ₹863 కోట్లు |
* | మల్కాజ్గిరి (MMC) | 7.91 లక్షలు | ₹502 కోట్లు |

### మొండి బకాయిదారులపై కొరడా

కేవలం రాయితీలే కాదు, మొండికేసిన వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించారు. పన్నులు చెల్లించని సుమారు 25 భారీ ఆస్తులను అధికారులు ఇప్పటికే జప్తు చేశారు. మార్చి 31 అర్ధరాత్రి వరకు కౌంటర్లు తెరిచి ఉంచి మరీ వసూళ్లు చేయడం అధికారుల పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది.

### * నేటి నుంచే 'ఎర్లీ బర్డ్'.. జేబుకు వెసులుబాటు!

కొత్త ఆర్థిక సంవత్సరం (202627) ప్రారంభమైన తరుణంలో పౌరులకు కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శుభవార్త వినిపించారు. ఏప్రిల్ నెలలోనే ప్రస్తుత ఏడాదికి సంబంధించిన పన్ను చెల్లించే వారికి 5% రాయితీ లభించనుంది. కొత్తగా ఏర్పడిన మూడు కార్పొరేషన్ల పరిధిలోనూ ఈ పథకం వర్తిస్తుంది. మై జీహెచ్ఎంసీ యాప్ లేదా మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### * సవాళ్లు.. అవకాశాలు!

విభజన వల్ల పాలన ప్రజలకు చేరువవుతుందని భావిస్తున్నప్పటికీ, ఉద్యోగుల సర్దుబాటు, నిధుల పంపిణీ మరియు ఆస్తుల విభజనలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, మూడు కార్పొరేషన్ల మధ్య ఏర్పడే 'ఆరోగ్యకరమైన పోటీ' నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించనుంది.




# ఆక్రమణల చెర నుంచి ఊపిరి పోసుకున్న చెరువులు, పార్కులు!




మల్కాజిగిరి, మార్చి 31 భారత శక్తి: పోలీసు వృత్తిలో సవాళ్లను ఎదుర్కొంటూ దశాబ్దాల పాటు క్రమశిక్షణతో సేవలు అందించిన అధికారులకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఘనంగా వీడ్కోలు పలికింది. విధి నిర్వహణలో నిబద్ధత చాటుకున్న ఏడుగురు అధికారులను సీపీ అవినాష్ మహంతి మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

### నిరంతర పోరాటమే పోలీస్ జాబ్

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం అంటేనే ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లతో కూడుకున్నదని కొనియాడారు. ఎంతో కాలం పాటు శాఖలో సమర్థవంతంగా పనిచేసి పదవీ విరమణ పొందడం సంతోషకరమని పేర్కొన్నారు. రిటైర్మెంట్ తర్వాత విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, కుటుంబ సభ్యులతో సమయాన్ని కేటాయించాలని సూచించారు.

### ఆరోగ్యంపై ఫోకస్ పెట్టండి..

రిటైర్డ్ అధికారులు తమ ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ తో పాటు ఇతర ఆర్థిక అంశాల విషయంలో క్రమశిక్షణతో ఉండాలని సీపీ హితవు పలికారు. వీరికి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ త్వరగా అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆయన అక్కడికక్కడే ఆదేశించారు.

### వీడ్కోలు పొందిన వారు వీరే..

కె. కరుణాకర్ రెడ్డి (సబ్ ఇన్స్పెక్టర్, ఘట్కేసర్)
పి. సత్యనారాయణ చారి (రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్)
ఎన్. జైరాం (ఏఎస్సై)
వై. సాయిబాబా (ఏఎస్సై)
ఏ. మూర్తుజా (ఏఎస్సై)
కె. పద్మా రావు (హోమ్ గార్డ్ ఆఫీసర్)
బి. బాలనర్సమ్మ (హోమ్ గార్డ్ ఆఫీసర్)

ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) ఇందిర, సీఏఓ శ్రీనివాస్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు భద్రా రెడ్డి, కోఆపరేటివ్ డైరెక్టర్ సువర్ణ, వల రాజు తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ జయంతి శోభా యాత్రకు
# మాజీ మంత్రికి ఆహ్వానం..

ఎల్బీనగర్, మార్చి 31(భారత శక్తి): ప్రతీ ఏడాది లాగే ఏప్రిల్ 2 గురువారం రోజు హనుమాన్ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ఆహ్వానాన్ని ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గురువారం సాయంత్రం 4:00 గంటలకు బిఎన్.రెడ్డి.నగర్ చౌరస్తా నుండి సాహెబ్ నగర్ శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయం వరకు శోభా యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తి, శక్తి, ఐక్యతకు ప్రతీకగా నిర్వహించే ఈ భవ్య హనుమాన్ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు,మాజీ కార్పొరేటర్లు,పలు డివిజన్ల అధ్యక్షులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ జోన్ @ సరూర్ 'నగదు' సర్కిల్..
# మ్యుటేషన్ అంటేనే ముడుపుల పండుగ!

- సీ.ఎం '99 డేస్ యాక్షన్ ప్లాన్'కు అధికారుల తూట్లు
- పెండింగ్ ఫైళ్లలో నంబర్ 1.. వసూళ్లలోనూ సాటిలేరు
- డీసీ, ఏఎంసీల కనుసన్నల్లోనే కాసుల వేట.. జనం బేజారు
- ఆర్థిక సంవత్సరం ముగింపు వేళ ఆస్తి పన్ను 'వసూల్' రాజా ఆటలు
- సరూర్నగర్ సర్కిల్, అవినీతి అధికారులపై , ఎం.ఎం.సి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ప్రత్యేక అధికారి జయేష్ రంజన్, మున్సిపల్ శాఖ మంత్రి సీ.ఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకునేనా...?




హైదరాబాద్ మార్చి 31(భారత శక్తి ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకగా చేపట్టిన '99 డేస్ యాక్షన్ ప్లాన్' ఆశయాలు సరూర్ నగర్ సర్కిల్ ఆఫీసు గుమ్మం కూడా దాటలేకపోతున్నాయి. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వం గీసిన గీతను ఇక్కడి అధికారులు తుడిచేస్తున్నారు. మార్చి 7న నిర్వహించిన "ఫైల్ క్లియరెన్స్ డే"ని అభాసుపాలు చేస్తూ, సాక్షాత్ సీఎం ఆదేశాలనే బేకాతర్ చేస్తున్నారు. ఫైళ్ల క్లియరెన్స్‌ను ప్రజా సేవగా కాకుండా.. 'కాసుల వేట'గా మార్చుకున్న వైనంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### * పెండెన్సీలో రికార్డు.. అంతా 'మామూలే'!

మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని 60 సర్కిళ్లలో ఎక్కడా లేనంత పెండెన్సీ ఒక్క సరూర్ నగర్ సర్కిల్‌లోనే ఉండటం ఇక్కడి పాలన తీరుకు అద్దం పడుతోంది. ఇతర సర్కిళ్లలో ఆస్తి పన్ను సవరణ దరఖాస్తులు 50 లోపు ఉంటే, ఇక్కడ ఏకంగా 191 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం గమనార్హం. ఇందులో 60 దరఖాస్తులు సవరణ పూర్తయినట్లు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో అవి ఇంకా పెండింగ్‌లోనే ఉండటం అధికారుల జిమ్మిక్కులకు నిదర్శనం. ఆర్థిక సంవత్సరం ముగియడానికి (మార్చి 31) కేవలం రెండు రోజులే సమయం ఉండటంతో, గత ఏళ్ల వడ్డీ భారం పడుతుందని సామాన్యులను భయపెట్టి, తెరవెనుక అనధికార వసూళ్లకు తెరలేపినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### మ్యుటేషన్లకూ 'ముడుపుల' మందు!

మ్యుటేషన్ల విషయంలోనూ సరూర్ నగర్ సర్కిల్ అవినీతిలో 'టాప్' గేర్‌లో దూసుకుపోతోంది. ఇక్కడ 59 మ్యుటేషన్ దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా సర్కిళ్లలో ఈ సంఖ్య 10 నుంచి 20 లోపే ఉండటం విశేషం. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న సామాన్యులకు నెలల తరబడి మోక్షం కలగడం లేదు కానీ, 'ప్రత్యేక చొరవ' (ముడుపులు) చూపిన వారికి మాత్రం ఒకట్రెండు రోజుల్లోనే ఫైల్ క్లియర్ అయిపోతోంది. అంటే, ఇక్కడ నిబంధనల కంటే నోట్ల కట్టలకే విలువ ఎక్కువన్నమాట!

### డీసీ vs ఏఎంసీ.. సామాన్యుల బలి

బాధితులు తమ గోడు చెప్పుకుందామని ఏఎంసీని కలిస్తే "డీసీ దగ్గరకు వెళ్లండి" అని, డీసీని కలిస్తే "నాకేం సంబంధం.. ఏఎంసీని అడగండి" అని ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారు. ఏఎంసీ లాగిన్‌లో నెలల తరబడి ఆగిపోతున్న ఫైళ్లు, అక్కడి నుంచి కదిలినా డీసీ లాగిన్‌లో మళ్ళీ తిష్ట వేస్తున్నాయి. డీసీ స్థాయిలోనే భారీ డిమాండ్లు ఉండటంతో దిగువ స్థాయి సిబ్బంది కూడా నోరు మెదపడానికి భయపడుతున్నారు. అధికారుల ఈ దోబూచులాటలో సామాన్య జనం ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ బలి పశువులవుతున్నారు.




### బాసులను బురిడీ కొట్టిస్తూ..

పైస్థాయి అధికారుల నుంచి నోటీసులు వచ్చినా, "అంతా సవ్యంగా ఉంది" అంటూ తప్పుడు నివేదికలు పంపి జోనల్ కమిషనర్‌ను సైతం బురిడీ కొట్టిస్తున్నట్లు తెలుస్తోంది. సరూర్ నగర్ డిప్యూటీ కమిషనర్ భువనగిరి శ్రీనివాస్, ఏఎంసీలు బాబురావు, శ్రీనివాసులు తమపై వస్తున్న అవినీతి ఆరోపణలను కప్పిపుచ్చుకోవడంలో సిద్ధహస్తులనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'భారత శక్తి' పత్రిక గత నెల రోజులుగా ఆధారాలతో సహా వార్తలు ప్రచురిస్తున్నా, ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేంటో అర్థం కావడం లేదు.

### ప్రభుత్వం స్పందించేనా?

మున్సిపల్ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యవహారంపై తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మున్సిపల్ నిధులను సొంత జేబుల్లోకి మళ్లించుకుంటున్నారని వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించి, అవినీతి అధికారులపై వేటు వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే ప్రజా ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.